

APTEL/26/A4813

# శ్రీ వార్త

జాతీయ తెలుగు దినపత్రిక

కొత్త ఆలోచన.. కొత్త వార్త




సంపుటి : 01 సంచిక :79 ఎడిటర్.: కూరేటి సతీష్ పేజిలు : 08, వెల రూ. 2రూ/ శనివారం - 26 - సెప్టెంబర్ - 2026

Published From : Circulated at Srikakulam,VishakaPatanam,Vijayanagaram, East Godavari, West Godavari, Krishna, Guntur, Prakasam, Nellore, Chittoor,, Kadapa, Anantapuram, Hyderabad

## గంగమ్మ ఒడికి ఖైరతాబాద్ మహాగణపతి... ప్రశాంతంగా ముగిసిన నిమజ్జనం




హుస్సేన్‌సాగర్‌లో ఖైరతాబాద్ మహాగణపతి నిమజ్జనం పూర్తి

69 అడుగుల పంచముఖ గణపతిగా దర్శనమిచ్చిన విగ్రహం

క్రేన్ నంబర్ 4 వద్ద మధ్యాహ్నం 2.15 గంటలకు నిమజ్జనం

## వంశధార, నాగావళికి పోటెత్తిన వరద.. మొదటి ప్రమాద హెచ్చరికలు జారీ




- భారీ వర్షాలతో వంశధార, నాగావళి నదులకు వరద ఉధృతి
- గొట్టా బ్యారేజ్ వద్ద మొదటి ప్రమాద హెచ్చరిక జారీ
- నారాయణపురం ఆనకట్ట వద్ద కూడా మొదటి ప్రమాద హెచ్చరిక

## దీన్‌దయాళ్ ఆలోచనలే వికసిత్ భారత్‌కు దిక్సూచి: ప్రధాని మోదీ




- దీన్‌దయాళ్ జయంతి సందర్భంగా మోదీ నివాళి
- వ్యక్తి ప్రగతి సమాజ హితంతో ముడిపడి ఉండాలన్నదే దీన్‌దయాళ్ సిద్ధాంతమని వెల్లడి
- అభివృద్ధి ఫలాలు అందరికీ అందాలనేదే అంత్యోదయ లక్ష్యమని వ్యాఖ్య

# కాకినాడ, నెల్లూరులలో ఇండస్ట్రియల్ పార్కులు, రిఫైనరీలు స్థాపించాలి

### అహ్మదాబాద్ పర్యటనలో పారిశ్రామిక దిగ్గజాలతో మంత్రి లోకేశ్ వరుస సమావేశాలు

- ★టొరెంట్, వెల్స్‌పన్, ఆస్ట్రల్.. అహ్మదాబాద్‌లో రెండో రోజు కూడా నారా లోకేశ్ బిజీబిజీ
- ★క్లీన్ ఎనర్జీ ప్రాజెక్టుల కోసం ఏపీని ఎంచుకోవాలని టొరెంట్ గ్రూప్‌కు పిలుపు
- ★విశాఖలో టైర్ల తయారీ, డేటా సెంటర్ల ఏర్పాటుపై పలు సంస్థలతో కీలక చర్చలు
- ★లోకేశ్ ప్రతిపాదనలను పరిశీలిస్తామని సానుకూలంగా స్పందించిన కంపెనీలు



అమరావతి: ఏపీకి పెట్టుబడులే లక్ష్యంగా ఏపీ ఐటీ, ఎలక్ట్రానిక్స్, విద్యా శాఖల మంత్రి నారా లోకేశ్ విస్తృత పర్యటనలు కొనసాగిస్తున్నారు. గుజరాత్ లోని అహ్మదాబాద్ టూర్‌లో భాగంగా రెండో రోజైన శుక్రవారం ఆయన పలు పారిశ్రామిక దిగ్గజాలతో సమావేశమయ్యారు. రాష్ట్రానికి భారీ పెట్టుబడులను ఆకర్షించడమే ధ్యేయంగా ఏడు ప్రముఖ సంస్థల అధిపతులు, ప్రతినిధులతో చర్చలు జరిపారు. క్లీన్ ఎనర్జీ, ఫార్మా, టెక్స్‌టైల్స్, మౌలిక సదుపాయాలు, డేటా సెంటర్లు, తయారీ వంటి కీలక రంగాల్లో ఏపీలో ఉన్న అవకాశాలను వారికి వివరించారు. రాష్ట్ర ప్రభుత్వ పారిశ్రామిక విధానాలు, మిగతా 2 లో




## ఓటర్ల జాబితాలో పేర్ల తొలగింపు.. ఫారం 7 అంటే ఏమిటి?.. ఎప్పుడు వాడాలి?

- చనిపోయిన, చిరునామా మారిన వారి పేర్లను తీసివేయడానికి ఇది ఉపయోగం
- అదే నియోజకవర్గంలోని ఏ ఓటరైనా ఫారం 7 ద్వారా అభ్యంతరం చెప్పవచ్చు
- దరఖాస్తు తర్వాత క్షేత్రస్థాయి విచారణ జరిపి తుది నిర్ణయం
- తప్పుడు సమాచారంతో ఫారం 7 దాఖలు చేస్తే ఏడాది జైలు శిక్ష

# వర్షాలు తగ్గే వరకు పూర్తి అప్రమత్తత అవసరం

### అవసరమైతే ముంపు ప్రాంతాల ప్రజల్ని సురక్షిత ప్రాంతాలకు తరలించాలి'

- యంత్రాంగం మరో రెండు రోజులు అప్రమత్తంగా ఉండాలి
- లోతట్టు ప్రాంతాల్లో నిరంతరం పర్యవేక్షణ ఉండాలి
- 'రెండు రోజుల్లో జిల్లా వ్యాప్తంగా 117.6 మి.మీ. వర్షపాతం నమోదైంది



అమరావతి: 'కాకినాడ జిల్లా వ్యాప్తంగా భారీ వర్షాలు కురుస్తున్నందున యంత్రాంగం మరో రెండు రోజులు అప్రమత్తంగా ఉండాలి. వానలు పూర్తిగా తగ్గేవరకు మిగతా 2 లో

# ఖైరతాబాద్‌లో భాజపా విజయం ఖాయం

### దానం కేసులో సుప్రీంకోర్టు తీర్పును మనస్ఫూర్తిగా స్వాగతిస్తున్నాం

కాంగ్రెస్ ఎమ్మెల్యేలను చేర్చుకుని కేసీఆర్ ప్రభుత్వం వారిని చట్ట వ్యతిరేకంగా మంత్రులను చేసింది

అదే రీతిలో భారాస ఎమ్మెల్యేను చేర్చుకుని కాంగ్రెస్ తమ పార్టీ తరఫున ఎంపీగా పోటీ చేయించింది

దానం వ్యవహారంలో.. కాంగ్రెస్, భారాసలు ఎవరికి వారే తమ విజయంగా భావించడం హాస్యాస్పదం

కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్




హైదరాబాద్: పార్టీ ఫిరాయింపుల చట్టం ఉల్లంఘనపై సుప్రీంకోర్టు తీర్పు కాంగ్రెస్, భారాసలకు చెంపపెట్టు లాంటిదని కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్ వేర్వేరు ప్రకటనల్లో పేర్కొన్నారు. మిగతా 2 లో




## నవంబర్ 1 నుంచి ఖరీఫ్ ధాన్యం కొనుగోళ్లు..

37 లక్షల టన్నుల సేకరణ లక్ష్యం: నాదెండ్ల మనోహర్

- విజయవాడలో పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యంలో వర్క్‌షాప్
- రాష్ట్ర వ్యాప్తంగా 2,619 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తామన్న నాదెండ్ల




## రేవంత్ రెడ్డికి 'బెస్ట్ పబ్లిక్ సర్వెంట్' అవార్డు

- కేరళకు చెందిన అర్షదాన్ ముహమ్మద్ ఫౌండేషన్ పురస్కారం
- ప్రజా సంక్షేమ పాలనకు లభించిన జాతీయ గుర్తింపు
- కేరళలోని నిలంబూర్‌లో నేడు అవార్డు ప్రదానోత్సవం
- కార్యక్రమానికి హాజరయ్యేందుకు కేరళ వెళ్లిన సీఎం

# రాష్ట్రంలో నిత్యం ఎదురవుతున్న ట్రాఫిక్ సమస్యలకు శాశ్వత పరిష్కారం

### రోడ్డు ప్రమాదాలను అరికట్టేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కీలక నిర్ణయం

- 'తెలంగాణ ట్రాఫిక్ మేనేజ్‌మెంట్, రోడ్ అండ్ రైల్ సేఫ్టీ బ్యూరో' ను ఏర్పాటు
- 'రాష్ట్ర రోడ్డు భద్రతా మండలి' పరిధిలో ఈ కొత్త వ్యవస్థ ముఖ్యమంత్రి పరిధిలో పనిచేస్తుంది
- 24 గంటలూ అందుబాటులో ఉండేలా ఒక 'రోడ్ యాక్సిడెంట్ రెస్పాన్స్ ఆఫీసర్'



హైదరాబాద్: రాష్ట్రంలో నిత్యం ఎదురవుతున్న ట్రాఫిక్ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపడంతో పాటు రోడ్డు ప్రమాదాలను అరికట్టేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కీలక నిర్ణయం తీసుకున్నారు. ట్రాఫిక్ నిర్వహణ అంటే కేవలం చలానాలు విధించడం, వసూలు చేయడమే కాకుండా, శాస్త్రీయ పద్ధతుల్లో ట్రాఫిక్‌ను నియంత్రించడం, అత్యవసర వైద్య సాయం అందించడమే లక్ష్యంగా 'తెలంగాణ ట్రాఫిక్ మేనేజ్‌మెంట్, రోడ్ అండ్ రైల్ సేఫ్టీ బ్యూరో' ను ఏర్పాటు చేశారు. 'రాష్ట్ర రోడ్డు భద్రతా మండలి' పరిధిలో ఈ కొత్త వ్యవస్థ ముఖ్యమంత్రి గారి పరిధిలో పనిచేస్తుంది. ఆ మేరకు ప్రభుత్వం ఉత్తర్వులు (జీవో 135) జారీచేసింది. మిగతా 2 లో

## అధికారాన్ని అడ్డుపెట్టుకుని రాజ్యాంగ విలువలను కాలరాస్తే న్యాయస్థానాలు చూస్తూ ఊరుకోవు




- సుప్రీం తీర్పు.. రేవంత్‌కు చెంపపెట్టు
- కాంగ్రెస్ ప్రభుత్వానికి ఇది గట్టి గుణపాఠం'
- "దేశవ్యాప్తంగా 'సంవిధాన్ బచావో' అంటూ రాజ్యాంగ పరిరక్షణ గురించి రాహుల్‌గాంధీ మాట్లాడుతున్నారు
- కాంగ్రెస్‌లోకి ఫిరాయించిన మిగతా ఎమ్మెల్యేలతోనూ రాజీనామా చేయించండి

## సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పనిచేయాలి....

# జిల్లా కలెక్టర్ డీకే బాలాజి

### గుడివాడలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక మీకోసం కార్యక్రమం నిర్వహణ



గుడివాడ శ్రీ వార్త న్యూస్ గుడివాడ నియోజకవర్గంలోని సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పనిచేయాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజి అధికారులను ఆదేశించారు.నియోజకవర్గ ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని, వాటి పరిష్కారానికి సత్వర చర్యలు తీసుకునే



ఉద్దేశంతో జిల్లా కలెక్టర్ శుక్రవారం గుడివాడలో బస్టాండ్కు ఎదురుగా ఉన్న ఇండియన్ మెడికల్ అసోసియేషన్ హాల్లో నియోజకవర్గస్థాయి ప్రత్యేక ప్రజా సమస్యల పరిష్కార వేదిక మీకోసం కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్, గుడివాడ నియోజకవర్గ శాసన సభ్యుడు వెనిగండ్ల రాముతో కలిసి ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. వివిధ సమస్యలపై వచ్చిన అర్జీదారులతో నేరుగా మాట్లాడి, వారి సమస్యలను ఓపికగా విని వివరాలను తెలుసుకున్నారు. ప్రతి అర్జీని క్షుణ్ణంగా పరిశీలించి, సమస్య పరిష్కారానికి అవసరమైన చర్యలపై సంబంధిత అధికారులతో అక్కడికక్కడే చర్చించారు.సమస్య స్వభావాన్ని బట్టి సంబంధిత శాఖల అధికారులను పిలిపించి, అర్జీదారుల సమస్యలను వివరించి, నిబంధనల మేరకు పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా, అర్జీలను నిర్ణీత గడువులో పరిశీలించి పరిష్కరించాలని స్పష్టం చేశారు.ప్రజల నుంచి వచ్చే ప్రతి అర్జీకి ప్రాధాన్యతనిస్తూ, సమస్యల పరిష్కారంలో జాప్యం లేకుండా అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ సూచించారు. నిర్ణీత సమయానికి సమస్యలను పరిష్కరించి, అర్జీదారులకు తగిన సమాచారం అందించాలని ఆదేశించారు.నియోజకవర్గ ప్రజలు తమ సమస్యలను నేరుగా అధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కారం పొందేందుకు ప్రభుత్వం అందిస్తున్న ఈ ప్రత్యేక వేదికను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ కోరారు. రాబోయే మూడు శుక్రవారాలు కూడా నియోజకవర్గస్థాయిలో ప్రత్యేక ప్రజా సమస్యల పరిష్కార వేదిక 'మీకోసం' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఈ సందర్భంగా కలెక్టర్ తెలిపారు.కార్యక్రమంలో కె ఆర్ ఆర్ సి ఎస్డిసి పి నీలకంతేశ్వరరెడ్డి, గుడివాడ ఆర్డీవో జి బాలసుబ్రమణ్యం, మున్సిపల్ కమిషనర్ మనోహర్ రావు, డీపీఓ ఎం ధనలక్ష్మి, డీఎస్పీ పాల శ్రీనివాసరావు, డిఎల్డిఓ సునీత శర్మ,సర్వే ఏడి లక్ష్మణరావు, ఆర్ అండ్ బి ఈఈ లోకేశ్వరావు, డ్రైనేజీ శాఖ ఈఈ కిరణ్ బాబు తదితర శాఖల డివిజన్, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

## వేమవరం కొండలమ్మ ఆలయంలో ఘనంగా అన్నప్రసాద వితరణ - దాతలకు సత్కారం



కృష్ణాజిల్లా శ్రీ వార్త న్యూస్ కృష్ణాజిల్లా గుడ్లవల్లేరు మండలం వేమవరం గ్రామంలో వేంచేసియున్న శ్రీ కొండలమ్మ అమ్మవారి దేవస్థానంలో జరుగుతున్న అన్నప్రసాద వితరణ కార్యక్రమం బుధవారం ఘనంగా నిర్వహించారు. శుక్రవారం అన్నప్రసాద వితరణకు సహకరించిన దాతలు విజయవాడ వాస్తవ్యులు పుట్టగుంట శ్రీరంగ, శ్రీమతి కనక దుర్గ దంపతులు మరియు రాజారావు, శ్రీమతి నిర్మలాదేవి దంపతుల చేతుల మీదుగా అన్నప్రసాద వితరణ జరిగింది.అన్నప్రసాద వితరణకు హుండీని సమర్పించిన దాతలు యార్లగడ్డ గణపతి శ్రీమతి కనకదుర్గ దంపతులు.ఈ కార్యక్రమానికి సహకరించిన దాతలను దేవస్థానం చైర్మన్ శ్రీ ఈడే మోహన్ శేష వస్త్రంతో సత్కరించి ప్రసాదాలు అందజేశారు.ఈ వివరాలను దేవస్థానం కార్యనిర్వహణాధికారి ఆకుల కొండలరావు ఒక ప్రకటనలో తెలిపారు

## వేమవరం కొండలమ్మ ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాలకు సన్నాహాలు ప్రారంభం






కృష్ణాజిల్లా శ్రీ వార్త న్యూస్ కృష్ణాజిల్లా గుడ్లవల్లేరు మండలం వేమవరం గ్రామంలో వేంచేసియున్న శ్రీ కొండలమ్మ అమ్మవారి దేవస్థానంలో అక్టోబర్ 11 నుండి 20 వరకు జరగనున్న శ్రీదేవి శరన్నవరాత్రి ఉత్సవాలకు ఏర్పాట్లు ప్రారంభమయ్యాయి.ఉత్సవాల సందర్భంగా శ్రీ అమ్మవారి దేవాలయానికి రంగులు వేయుట, ఇతర అభివృద్ధి పనులు ప్రారంభించినట్లు దేవస్థానం చైర్మన్ ఈడే మోహన్, కార్యనిర్వహణాధికారి ఆకుల కొండలరావు, ట్రస్ట్ బోర్డు సభ్యులు మరియు సిబ్బంది ఒక ప్రకటనలో తెలిపారు.

## వొకేషనల్ విద్యార్థులకు ఆన్ ది జాబ్ ట్రైనింగ్

### కృష్ణాజిల్లాలో సమీక్షా సమావేశం




మచిలీపట్నం,శ్రీవార్త న్యూస్ ఇంటర్మీడియట్ కమిషనర్ ఉత్తర్వుల మేరకు కృష్ణా జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖాధికారి ఎస్. సరళ కుమారి శుక్రవారం జిల్లాలోని వొకేషనల్ కళాశాలల ప్రిన్సిపాళ్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ సమావేశంలో ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు అక్టోబర్ 3వ తేదీ నుండి 47 రోజుల పాటు, ప్రథమ సంవత్సరం విద్యార్థులకు అక్టోబర్ 27 నుండి ఆన్ ది జాబ్ ట్రైనింగ్ ప్రోగ్రామ్ ప్రారంభించాలని ఆదేశించారు.జిల్లాలోని వొకేషనల్ కళాశాలల్లో విద్యార్థులు ఏ ఆర్గనైజేషన్ కు వెళుతున్నారు, ఎంతమంది ప్రథమ, ద్వితీయ సంవత్సర విద్యార్థులు వెళుతున్నారు, ఆ ఆర్గనైజేషన్ నుండి అనుమతి లేఖ తదితర వివరాలను ఈ నెల 29వ తేదీ సాయంత్రం 5 గంటల లోపు మచిలీపట్నం డీఐఈఓ కార్యాలయంలో అందజేయాలని ఆమె తెలిపారు.

**త్రీ మెన్ కమిటీ నియామకం:**

ఇంటర్ విద్యార్థులకు ఆన్ లైన్ జాబ్ డ్రైవింగ్ మరియు ఆన్ ది జాబ్ ట్రైనింగ్ ప్రోగ్రామ్ (సెప్టెంబర్ నుండి డిసెంబర్ 2026 వరకు) నిర్వహణ కోసం అనుభవం కలిగిన ముగ్గురు అధ్యాపకులతో కమిటీని నియమిస్తూ ఇంటర్మీడియట్ బోర్డు ఆదేశాలు జారీ చేసింది.1. లంకిశెట్టి కుసుమ హరినాథ్ బాబు – లేడీ యాంప్తుల్ కళాశాల, మచిలీపట్నం2. సీహెచ్. ఆనంద లక్ష్మీనారాయణ – ప్రభుత్వ జూనియర్ కళాశాల, మొవ్వ3. వైఎస్. స్పందన – లేడీ యాంప్తుల్ ప్రభుత్వ కళాశాల, మచిలీపట్నంఈ నియామకం తక్షణమే అమల్లోకి వస్తుందని, ఇంటర్మీడియట్ విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు కోఆర్డినేటర్ ప్రోగ్రాములు నిర్వహించాలని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖాధికారి ఎస్. సరళ కుమారి పేర్కొన్నారు.

## బందరులోని ప్రతి ప్రాంతంలో మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పిస్తాం

### కృష్ణా జిల్లా మొత్తాన్ని మోడల్ జిల్లాగా మార్చి చూపించేలా కృషి చేస్తున్నాం

### జిల్లా కోర్టు సెంటర్ వద్ద డ్రైనేజీ నిర్మాణ పనుల్ని అధికారులతో కలిసి పరిశీలించిన మంత్రి కొల్లు రవీంద్ర



మచిలీపట్నం శ్రీవార్త న్యూస్ మచిలీపట్నం మున్సిపాలిటీ పరిధిలో డ్రైనేజీ పనులకు అధిక ప్రాధాన్యమిచ్చామని రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు. ఈ మేరకు మచిలీపట్నంలోని జిల్లా పరిషత్



సెంటర్ వద్ద జరుగుతున్న డ్రైనేజీ పనుల్ని అధికారులతో కలిసి పరిశీలించారు. పనుల్ని వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు. మచిలీపట్నం మున్సిపాలిటీలో అభివృద్ధి పనుల కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.15 కోట్లు కేటాయించింది. గతంలో నిలిచిపోయిన పనులన్నింటినీ పూర్తి చేస్తున్నాం. రోడ్డు నిర్మాణాలను కూడా వేగంగా పూర్తి చేయనున్నాం.భవిష్యత్తులోనూ ఇబ్బందులు లేకుండా అమృత్ పథకంతో పూర్తి చేస్తాం. ఎస్టీపీలను కూడా త్వరితగతిన పూర్తి చేస్తున్నాం. మెడికల్ కాలేజీకి వెళ్లే పైపులైన్ల పనులు రైల్వే శాఖ అనుమతుల జాప్యంతో ఆగాయి. వాటిని పూర్తి చేసేలా రైల్వే అధికారులతో మాట్లాడుతున్నాం. ఇటీవలే హామ్ పథకం ద్వారా కూడా అభివృద్ధి పనులు ప్రారంభించాం. పనులన్నీ పూర్తయితే ఎంత వర్షం వచ్చినా.నీరు నిలిచే అవకాశమే ఉండదు. ప్రభుత్వం చేస్తున్న కృషికి ప్రజలు కూడా సహకరించాలని విన్నవించారు. రోడ్ల పక్కన, ఫుట్ పాత్ల వద్ద ఆక్రమణల కారణంగా అభివృద్ధి పనుల్లో జాప్యం జరుగుతోంది.డ్రైనేజీల్లో మురుగు తీసే అవకాశం లేకుండా పోతోంది. అందుకే నీరు రోడ్లపైకి చేరుతోంది. గత ఐదు సంవత్సరాల్లో కాలువల్లో సిల్టు కూడా తొలగించకపోవడంతోనే ఇప్పుడు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఇప్పటికే డంపింగ్ యార్డును పూర్తిగా తొలగించాం. కొత్తగా కృష్ణా యూనివర్శిటీ వద్ద కొత్త యార్డు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటున్నాం. నియోజకవర్గాన్ని ఏ విధంగా అభివృద్ధి చేయాలా అని నిరంతరం కృషి చేస్తున్నాం.కనెక్టివిటీ డ్రెయిన్లు అన్నీ పూర్తి చేస్తే మురుగు సమస్య అనేదే ఉండదు. కోనేరు సెంటర్ వద్ద ఉన్న ఇబ్బందులన్నీ పూర్తి చేస్తాం. కోనేరు సెంటర్ వద్ద నీరు నిలిచే అవకాశం లేకుండా చర్యలు తీసుకోవడంతో పాటుగా.. ఐకానిక్ నిర్మాణంగా కోనేరు సెంటర్ ను మార్చబోతున్నాం. ధర్నాల చెరువు వద్ద కూడా అభివృద్ధి పనులు చేపట్టాం. బందరు పోర్టు పరిశీలన సమయంలో గిలకలదిండి నుండి బందరు కాలువను కలపడం ద్వారా, అక్కడి నుండి అమరావతి వరకు వాటర్ వేస్ నిర్మాణం చేయొచ్చని ముఖ్యమంత్రికి ప్రతిపాదించాం.ఈ జలరవాణా మార్గం అందుబాటులోకి వస్తే రవాణా అత్యంత సులభతరం అవుతుంది. ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్టును వీలైనంత త్వరగా పూర్తి చేసేందుకు కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తోంది. ఇప్పటికే గోవా షిప్ యార్డు సంస్థ వచ్చింది. మరో రూ.1500 కోట్లతో రిఫైనరీ కూడా బందరుకు రాబోతోంది. కోస్టల్ హైవేకు సంబంధించిన ప్రతిపాదనలు కూడా ముఖ్యమంత్రికి అందించాం. ఈ ప్రాజెక్టులన్నీ పూర్తయితే బందరు అభివృద్ధి ఊహలకు అందని స్థాయిలో ఉంటుందని మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ బాపిరాజు, గొర్రెపాటి గోపీచంద్, బాబా ప్రసాద్, బ్రహ్మణ కార్పోరేషన్ డైరక్టర్ పీ వీ ఫణి కుమార్, టౌన్ అధ్యక్షులు లోగిసెట్టి స్వామి, కోస్తా మురళీకృష్ణ, దింటకుర్తి సుధాకర్ తదితరలు పాల్గొన్నారు.

## చిరంజీవి బ్లడ్ బ్యాంక్‌లో 51వ సారి రక్తదానం చేసిన మెండు వీరబాబు





హైదరాబాద్,శ్రీ వార్త ప్రతినిధి:రక్తదానం ప్రాణదానం అనే నినాదాన్ని నిజం చేస్తూ చల్లపల్లి కాపు సంక్షేమ సమితి నాయకుడు మెండు వీరబాబు మరోసారి తన దాతృత్వాన్ని చాటుకున్నారు. హైదరాబాద్‌లోని చిరంజీవి ఛారిటబుల్ ట్రస్ట్ బ్లడ్ బ్యాంక్‌లో ఆయన 51వ సారి రక్తదానం చేసి అందరికీ ఆదర్శంగా నిలిచారు.ఈ సందర్భంగా బ్లడ్ బ్యాంక్ పర్యవేక్షకులు, చిరంజీవి ఫ్యాన్స్ అసోసియేషన్ రాష్ట్ర నేత రమణం స్వామి నాయుడు చేతుల మీదుగా వీరబాబుకు ప్రశంసా పత్రాన్ని అందజేశారు.రక్తదానం చేయడం వల్ల ఆరోగ్యానికి ఎటువంటి హాని లేదని, ప్రతి ఒక్కరూ ముందుకు వచ్చి రక్తదానం చేయాలని ఈ సందర్భంగా మెండు వీరబాబు పిలుపునిచ్చారు. తనకు స్ఫూర్తినిచ్చిన మెగాస్టార్ చిరంజీవికి కృతజ్ఞతలు తెలిపారు.

## నర్మదా నదిలో ఘనంగా గణనాథుని నిమజ్జనం





(ఎస్.ఎస్.ఆర్. ఆంజనేయులు):భారుచ్ .గుజరాత్. శ్రీ వార్త ప్రత్యేక ప్రతినిధి దేశవ్యాప్తంగా వినాయక నవరాత్రి ఉత్సవాలు ఘనంగా ముగియగా, గుజరాత్ లోని భారుచ్ లో నర్మదా నదిలో గణనాథుని నిమజ్జన కార్యక్రమం భక్తిశ్రద్ధలతో, కన్నుల పండువగా నిర్వహించారు.భారుచ్ జిల్లా గోల్డెన్ రెసిడెన్సీ నందు వినాయక నవరాత్రి ఉత్సవాలను వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గణనాథునికి ప్రత్యేక పూజలు, లక్ష్మీదేవికి కుంకుమార్చనలు, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.సన్ ఫార్మా జనరల్ మేనేజర్ శ్రీధరమల్లె రవి వెంకట నారాయణ, శుభా ప్రవీణ దంపతులు గణనాథునికి ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఉత్సవాల్లో భాగంగా భక్తులు భజనలు, కోలాటాలతో ఆధ్యాత్మిక వాతావరణాన్ని నెలకొల్పారు.సమీపంలోనే పవిత్ర నర్మదా నది ఉండటంతో ఈ ప్రాంతం వారంతా వినాయకుని నిమజ్జన కార్యక్రమానికి పెద్ద ఎత్తున తరలివచ్చారు. డప్పు వాయిద్యాలు, "గణపతి బప్పా మోరియా" నినాదాల మధ్య గణనాథుని నర్మదా నదిలో నిమజ్జనం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజలు, ఉద్యోగులు, చిన్నారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి ఎమ్మెల్యే కాగిత కృష్ణ ప్రసాద్





బంటుమిల్లి శ్రీ వార్త న్యూస్ : ప్రజా సమస్యల పరిష్కారానికి అంకితభావంతో అహర్నిశలు కృషి చేస్తున్నామని పెడన నియోజవర్గం ఎమ్మెల్యే కాగిత కృష్ణ ప్రసాద్ అన్నారు.శుక్రవారం బంటుమిల్లి మండలం జానకిరామపురం తెలుగుదేశం పార్టీ కార్యాలయంవద్ద ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రజల నుంచి పలు సమస్యల పై అర్జీలను ఎమ్మెల్యే కాగిత.కృష్ణ ప్రసాద్ స్వీకరించారు. స్వీకరించారు. గ్రామాలలో నీటి సమస్య, రోడ్ల ఏర్పాటు, భూ ఆక్రమణలు, రెవెన్యూ, విద్యుత్ సమస్యలు, తదితర అంశాలపై పలువురు అర్జీలను సమర్పించారు. ప్రజా దర్బారులో ప్రజలు ఇచ్చిన అర్జీలు, ఫిర్యాదులను ఎమ్మెల్యే కాగిత కృష్ణ ప్రసాద్ పరిశీలించారు. పరిష్కరించ గల అర్జీల పై నిర్లక్ష్యం చేయకుండా, శ్రద్ధ వహించాలని సంబంధించిన శాఖ అధికారులకు సూచించారు.ప్రజా దర్బార్ ద్వారా ప్రజలు ఎదుర్కొంటున్న ప్రతి సమస్యను బాధ్యతతో స్వీకరించి, త్వరితగతిన పరిష్కరించేందుకు కట్టుబడి ఉన్నామన్నారు. రైతుల భూ సమస్యలపై వచ్చిన అర్జీల పట్ల ఎక్కడ అలసత్వం వహించకుండా వి.ఆర్.ఏ., వీఆర్వో స్థాయి నుంచి తహసిల్దార్ వరకు అందరూ వేగవంతంగా పరిష్కరించే జవాబుదారితనంగా ఉండాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో నీటి సంఘం అధ్యక్షులు బొర్రా.కాశీ విశ్వేశ్వరరావు, పి.ఎ.సి.ఎస్ అధ్యక్షులు ఇల్లూరి. లీలా కృష్ణ, భూపతి రమేష్ నాయకులు, ఎం.డి. నజీర్ కార్యకర్తలు అర్జీదారులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ప్రపంచ ఫార్మసిస్ట్ దినోత్సవం -ఫార్మసిస్ట్ చిత్తజల్లు కృష్ణకు ఘన సత్కారం



ఘంటసాల, శ్రీవార్త న్యూస్ :మండల కేంద్రమైన ఘంటసాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఘనంగా ప్రపంచ ఫార్మాసిస్టుల దినోత్సవాన్ని వైద్యాధికారి డాక్టర్ వేమూరి ప్రమోద్ కుమార్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఫార్మసిస్ట్ గా పని చేస్తున్న చిత్తజల్లు కృష్ణని దుశ్యాలవాతో డాక్టర్ ప్రమోద్ కుమార్ సిబ్బంది ఘనంగా సన్మానించారు. హెల్త్ సూపర్వైజర్ శివకృష్ణ, సీనియర్ అసిస్టెంట్ కుమార్, హెల్త్ అసిస్టెంట్ శ్రీనివాసరావు, స్టాఫ్ నర్స్ రాజేశ్వరి, ల్యాబ్ టెక్నీషియన్ దివ్య, ఎఫ్ ఎన్ ఓ రాజమ్మ, తదితర ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు

## ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న కూటమి నేతలు

రహదారుల అభివృద్ధికి డిప్యూటీ సీఎం కొణిదెల పవన్ కళ్యాణ్ కీలక సహకారం

పల్లె పండుగ-3.0 ద్వారా వీబీజీ-రాంజీ నిధులు రూ.8.05 కోట్లు మంజూరు

నూతన సీసీ రోడ్డు నిర్మాణానికి రూ.42లక్షలు మంజూరు పట్ల హర్షం

పవన్ కళ్యాణ్ చిత్రపటానికి స్థానికులు, నాయకుల పాలాభిషేకం

ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ కు కృతజ్ఞతలు తెలిపిన స్థానిక ప్రముఖులు



అవనిగడ్డ సెప్టెంబర్ 25 శ్రీ వార్తనియోజకవర్గంలో ప్రధాన రహదారుల అభివృద్ధికి డిప్యూటీ సీఎం కొణిదెల పవన్ కళ్యాణ్ కీలక సహకారం అందిస్తున్నారని నియోజకవర్గ యువనాయకులు మండలి వెంకట్రామ్ తెలిపారు. శుక్రవారం అవనిగడ్డ రెండో వార్డులో జనసేన పార్టీ ఆధ్వర్యంలో డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. స్థానిక కొత్త వంతెన వద్ద నుంచి డీఎస్పీ కార్యాలయం వరకు ఉన్న నూకలవారిపాలెం డాక్టర్ గారి రోడ్డు సీసీ రోడ్డుగా అభివృద్ధి చేసేందుకు వీబీజీ-రాంజీ నిధులు రూ.42 లక్షలు మంజూరు చేసిన సందర్భంగా ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ లకు స్థానికులు, నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా మండలి వెంకట్రామ్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో గ్రామీణ అభివృద్ధికి డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నారని తెలిపారు. పల్లె పండుగ-1.0 కార్యక్రమం ద్వారా నియోజకవర్గంలో రూ.30.65 కోట్లతో 45 కిలోమీటర్లు సీసీ రోడ్లు నిర్మించినట్లు తెలిపారు. పల్లె పండుగ-2.0 కార్యక్రమం ద్వారా రూ.7కోట్లతో 15 కిలోమీటర్లు తారు రోడ్లు నిర్మించినట్లు తెలిపారు. సాస్కి నిధులు రూ.14.57 కోట్లతో 22.304 కిలోమీటర్ల తారు రోడ్లు నిర్మిస్తున్నట్లు తెలిపారు. పల్లె పండుగ-3.0 ద్వారా రూ.8.05 కోట్లతో 17కిలోమీటర్లు తారు, గ్రావెల్, సీసీ రోడ్లు మంజూరు అయినట్లు వివరించారు. స్థానిక ప్రముఖులు మాట్లాడుతూ చిరకాలంగా ఎదురుచూస్తున్న రహదారి నిర్మాణానికి నిధులు మంజూరు చేసిన డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ లకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో జనసేన మండల అధ్యక్షులు గుడివాక శేషుబాబు, స్థానిక ప్రముఖులు డాక్టర్ తుంగల శ్రీనివాస్, డాక్టర్ చేబ్రోలు హరిబాబు, సనకా కోటేశ్వరరావు, గ్యాస్ రాజు, తుంగల రంగాజీ, బీజేపీ నియోజకవర్గ కో-కన్వీనర్ టీవీ గిరి, నాయకులు భూపతి సుబ్రహ్మణ్యం, జనసేన సీనియర్ నాయకులు చెన్నగిరి సత్యనారాయణ, జనసేన రాష్ట్ర కార్యదర్శి లంకె యుగంధర్, జిల్లా కార్యదర్శి గాజుల శంకరరావు, ఏఎంసీ వైస్ చైర్మన్ రాజనాల వీరబాబు, కోడూరు మండల పార్టీ అధ్యక్షులు మర్రె గంగయ్య, మాజీ ఎంపీటీసీ కటికల వసంత్, సొసైటీ అధ్యక్షులు యలవర్తి చిన్నా, ఆసుపత్రి డైరెక్టర్ బచ్చు కృష్ణకుమారి, పార్టీ నాయకులు మత్తి శ్రీనివాసరావు, బచ్చు శ్రీహరి, కమ్మిలి మారిబాబు, గుగ్గిలం అనీల్, గుగ్గిలం గాయత్రి, గౌస్ కాటమ, గరికపాటి హరిబాబు, గరికపాటి శ్రీను, కోసూరు అవినాష్, మండలి శివప్రసాద్, యలవర్తి ఆది, మాదివాడ రాము, మత్తి సుబ్రహ్మణ్యం, పప్పుశెట్టి శ్రీనివాస్, గుడివాక రామాంజనేయులు, అన్నపరెడ్డి రామదాసు, సిద్ధినేని అశోక్ నాయుడు, పూతబోయిన కరుణ కుమార్, పూతబోయిన సీతా రత్న సాయిబాబు, కోట రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎమ్మెల్యే మండలి

## ప్రత్యేక అధికారులు గ్రామాల అభివృద్ధికి బాధ్యతగా పని చేయాలి

### గ్రామ సచివాలయ సిబ్బంది సమయపాలన పాటించాలి



అవనిగడ్డ సెప్టెంబర్ 25 శ్రీవార్తప్రత్యేక అధికారులు గ్రామాల అభివృద్ధికి బాధ్యతగా పని చేయాలని అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ స్పష్టం చేశారు. శుక్రవారం మధ్యాహ్నం అవనిగడ్డ రెవిన్యూ భవనంలో నియోజకవర్గ విస్తృత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మండల పరిషత్, గ్రామ పంచాయతీ పాలకవర్గముల గడువు ముగియటంతో ప్రత్యేక అధికారులుగా నియమితులు అయిన అధికారులు గ్రామాల పరిస్థితిని పరిశీలించి ప్రణాళికతో పని చేయాలని సూచించారు. ప్రధానంగా పారిశుధ్యం, త్రాగునీరు, స్ట్రీట్ లైట్లు, డ్రైనేజీ సమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కారం చేయాలని సూచించారు. ప్రజల సమస్యలు, గ్రామ అవసరాలు గుర్తించి పరిష్కారం చేయాలని సూచించారు. స్థానిక సంస్థల ఎన్నికలు జరిగే వరకూ ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలు, ప్రజా ఉపయోగ కార్యక్రమాలు బాధ్యతగా నిర్వర్తించాలని సూచించారు. ప్రభుత్వం మంజూరు చేస్తున్న నిధులతో చేపట్టే అభివృద్ధి పనులన్నీ నాణ్యతా ప్రమాణాలతో జరిగేలా శ్రద్ధ చూపాలని సూచించారు. ప్రభుత్వ కార్యాలయాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. గ్రామ సచివాలయాల్లో సిబ్బంది బాధ్యత, క్రమశిక్షణ, సమయపాలనతో పని చేయాలని సూచించారు. ఇటీవల తాను నిర్వహించిన ఆకస్మిక తనిఖీల్లో గ్రామ కార్యదర్శులు కొందరు హాజరు పట్టిలో సంతకాలు కూడా చేయకపోవటం, కొందరు సిబ్బంది కార్యాలయాల్లో అందుబాటులో ఉండకపోవటం గమనించినట్లు తెలిపారు. రైతు సేవా కేంద్రాల సిబ్బంది తమ కార్యాలయాల్లో రైతులకు అందుబాటులో ఉండాలని స్పష్టం చేశారు. ప్రత్యేక అధికారులు ప్రజల ప్రశంసలు అందుకునేలా పని చేయాలని సూచించారు.ఈ సందర్భంగా నియోజకవర్గ ప్రత్యేక అధికారి పెనుమూడి సాయిబాబు నియోజకవర్గంలోని అధికారులతో అంశాలవారీగా చర్చించారు. గ్రామ సచివాలయ సిబ్బంది ఖచ్చితంగా ప్రజలకు అందుబాటులో ఉండాలని స్పష్టం చేశారు. గ్రామ సచివాలయ కార్యాలయాలపై నియమితులు అయిన డిప్యూటీ ఎంపీడీఓలు ఈ అంశంపై ఎందుకు బాధ్యత వహించటం లేదని ప్రశ్నించారు. హాజరు రిజిస్టర్, మూవ్మెంట్ రిజిస్టర్, జాబ్ చార్ట్ సక్రమంగా నిర్వహిస్తున్నారా అని ప్రశ్నించారు. ఆకస్మిక తనిఖీలో సిబ్బంది నిర్లక్ష్యం బయటపడితే చర్యలు తప్పవని స్పష్టం చేశారు. 22ఏ పరిష్కారం కోరుతూ రైతులు సమర్పించిన దరఖాస్తుల పరిష్కారం, పింఛన్ దరఖాస్తుల ప్రక్రియ, చెత్త నుంచి సంపద కేంద్రాల నిర్వహణ తదితర అంశాలను చర్చించారు. సమావేశంలో మండల ప్రత్యేక అధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీఓలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ఘంటసాల రైతులు డాక్టర్ వి సత్యప్రియ లలితకు పౌర సన్మానం

–ఘంటసాల రైతుల ప్రోత్సాహం మరువలేనిది.. సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ సత్యప్రియ లలిత



ఘంటసాల, శ్రీవార్త న్యూస్ :మండల కేంద్రమైన ఘంటసాల రైతులు ప్రోత్సాహం మరువలేనిదని సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ వి సత్యప్రియ లలిత శుక్రవారం పేర్కొన్నారు. ఘంటసాల వ్యవసాయ పరిశోధన స్థానం నందు పనిచేసిన సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ వి సత్యప్రియ లలిత ఘంటసాల రైతుల మన్ననలను పొందారు. సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ సత్యప్రియ లలిత ఉయ్యూరు చెరుకు పరిశోధన స్థానానికి బదిలీ



అవటంతో ఘంటసాల రైతులు శుక్రవారం ఆమెకు పౌర సన్మానం చేశారు అనంతరం రైతులు ఆమె చేసిన సేవలు నెమరు వేసుకున్నారు. జిల్లా ఆదర్శ రైతు అయినపూడి విజయకుమార్ మాట్లాడుతూ ఆమె ఏఆర్ఎస్ లో 5 సం"లు పనిచేశారనీ . మినుము, పెసలలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చారనీ , ఆమె చేసిన సేవలు మరువలేనివి అన్నారు. అనంతరం పిఏసిఎస్ ఘంటసాల చైర్ పర్సన్ బండి పరాత్పరరావు, దేవరకోట పాల ప్రెసిడెంట్ వేమూరి రత్నగిరిరావు, ఘంటసాలపాలెం ఆదర్శ రైతు ఉప్పల చినబాబు తదితరులు డాక్టర్ సత్యప్రియ లలితను దుశ్యాలువతో ఘనంగా సత్కరించారు. సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ జే. పద్మావతి తదితర శాస్త్రవేత్తలు రైతులు పాల్గొన్నారు

## నిమజ్జనానికి తరలి వెళ్తున్న గణనాధుడు





నిజాంపేట్,శ్రీ వార్త ప్రత్యేక ప్రతినిధి 11 రోజులు పూజలు అందుకున్న గణనాధుడు ఇక శోభా యాత్రకు బయకుదేరాడు. అనేక చోట్ల వినాయకునికి పూజలు అన్నదానాలు, లడ్డు వేలంపాటలు పూర్తిచేశారు.నిజాంపేట్ కు దగ్గరలో వున్న ప్రగతి నగర్ చెరువు, బాచ్ పల్లి చెరువు లలో నిమజ్జనం కార్యక్రమానికి భారీగా మహిళలు సైతం తరలి వెళ్లారు. నిజాంపేట్ డబుల్ బెడ్ రూమ్స్ ఒకటవ బ్లాక్ వారు గణనాధుని శోభయాత్ర అనంతరం ఘనంగా నిమజ్జన కార్యక్రమం జరిగింది. తమ కుటుంబాలను చల్లగా చూడాలని తమ కుటుంబాలకు సకల ఫలితాలు అందించాలని కోరుతున్నారు.

## విశ్రాంత ఉపాధ్యాయులు వెంకట గోపాలరావు మృతి తీరని లోటు- పిఏసిఎస్ అధ్యక్షులు గుత్తికొండ వరప్రసాద్



ఘంటసాల, శ్రీవార్త న్యూస్ :మండల పరిధిలోని చిట్టుర్పు గ్రామ నివాసి అయిన విశ్రాంత ఉపాధ్యాయులు నాదెళ్ల వెంకట గోపాలరావు (86) సం "లు అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందటం తీరని లోటని కొడాలి పిఏసిఎస్ అధ్యక్షులు గుత్తికొండ వరప్రసాద్ ఆవేదన చెందారు. ఆయన భౌతికగాయానికి కొడాలి పిఏసిఎస్ అధ్యక్షులు గుత్తికొండ వరప్రసాద్, జడ్పీ మాజీ ఉపాధ్యక్షులు గొర్రెపాటి వెంకట రామకృష్ణ, మైనేని మురళి, విశ్రాంత ఉపాధ్యాయుల, శిష్య బృందం, ఆయన భౌతికయానికి ఘన నివాళు లర్పించారు. అనంతరం పిఏసిఎస్ అధ్యక్షులు వరప్రసాద్ మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తికి వన్నెతెచ్చిన మహనీయుడు నాదెళ్ల వెంకట గోపాలరావు అని, ఆయన మరణం ఉపాధ్యాయ కుటుంబానికి, శిష్య బృందానికి తీరనిలోటని పేర్కొన్నారు. ఆయనకు ఇద్దరు కుమార్తెలు .ముమ్మనేని లక్ష్మీ భవాని, హనుమంతు మాధవి ఉన్నారు

## బెజవాడ మేయర్ రేసులో గన్నే ప్రసాద్ పేరు హాట్ టాపిక్..!



### మేయర్ అభ్యర్థిత్వంపై రాజకీయ వర్గాల్లో బలంగా వినిపిస్తున్న పేరు --- గన్నే ప్రసాద్ ('అన్నా')!

విజయవాడ, సెప్టెంబర్ 25, శ్రీ వార్త న్యూస్:తెలుగుదేశం ఆవిర్భావం నుంచి పార్టీతో సుదీర్ఘ అనుబంధం... సమర్థత.. పార్టీ పట్ల నిబద్ధత.. నాయకత్వం పట్ల విధేయత.. కార్యకర్తలతో అనుబంధం.. ఇవే గన్నే ప్రసాద్ 'అన్నా' రాజకీయ ప్రస్థానానికి ప్రత్యేక గుర్తింపు.పదవుల కంటే పార్టీనే ముందు.. ప్రచారం కంటే కార్యకర్తలతో అనుబంధానికే ప్రాధాన్యత ఇస్తారు.బెజవాడ తో పాటు ఉమ్మడి కృష్ణాజిల్లాలో కీలకమైన నేతగా.. విజయవాడ అర్బన్ ప్రధాన కార్యదర్శిగా, రాష్ట్ర కార్యదర్శిగా పదవుల నిర్వహించారు ఎమ్మెల్యే, కేడీసీసీ బ్యాంక్ చైర్మన్, జిల్లా టీడీపీ అధ్యక్షుడు వంటి పదవులు దక్కకపోయినా.. పదవుల కోసం పట్టుబట్టకుండా పార్టీ కోసం పనిచేసిన నాయకుడిగా గన్నే ప్రసాద్‌కు పార్టీ శ్రేణుల్లో ప్రత్యేక గుర్తింపు ఉంది.ఇప్పుడు విజయవాడ మేయర్ అభ్యర్థిత్వంపై చర్చ మొదలైన వేళ..ఆశావహుల్లో ఎవరికి అవకాశం?కూటమిలో ఎలాంటి సమీకరణాలు?అధిష్టానం ఎవరిని ఎంపిక చేస్తుంది? అనే ప్రశ్నలు బెజవాడ రాజకీయాల్లో ఆసక్తి రేపుతున్నాయి.ఒక పదవి కోసం కాదు.. తన సుదీర్ఘ రాజకీయ ప్రయాణంలో పార్టీ క్రమశిక్షణకు కట్టుబడి, కార్యకర్తలకు అండగా నిలిచిన నాయకుడిగా "అన్నా" గన్నే ప్రసాద్ పేరు బెజవాడ రాజకీయాల్లో ప్రత్యేకంగా చర్చ నడుస్తుంది. ఏది ఏమైనా అన్నా కి మేయర్ పదవి ఇచ్చి న్యాయం చేయాలని టిడిపి నాయకులు, విజయవాడ ప్రజల ముక్తకంఠంగా కోరుతున్నారు.

## బాధ్యతలు స్వీకరించిన ప్రత్యేక అధికారి ఫణి ధూర్జేటి



పామర్రు,శ్రీ వార్త న్యూస్ పామర్రు మండల పరిషత్తు నూతన ప్రత్యేక అధికారిగా జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి ఎం. ఫణి ధూర్జేటిశుక్రవారం బాధ్యతలు చేపట్టారు. విధి నిర్వహణలో భాగంగా మండలంలోని అన్ని గ్రామాల్లో ప్రభుత్వ ప్రాధాన్యత పనుల పురోగతిని నిరంతరం పర్యవేక్షిస్తామని ఆయన పేర్కొన్నారు. ప్రజలకు సేవలు అందించడంలో క్షేత్రస్థాయి యంత్రాంగం నిబద్ధతతో వ్యవహరించాలని, విధుల్లో అలసత్వాన్ని సహించేది లేదని స్పష్టం చేశారు. నూతన ప్రత్యేక అధికారిని ఎంపీడీఓ కాండ్రు జ్యోతి, డిప్యూటీ ఎంపీడీఓ బొమ్మ సాని వెంకటసుబ్బారావు, ఏవో శశి కుమార్,మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది ఆత్మీయంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.

## అంగన్‌వాడీలో వైభవంగా 'ఉత్సవ సేవా సంకల్ప అభియాన్'.. ఆరోగ్య రక్షణే లక్ష్యం



పామర్రు శ్రీ వార్త న్యూస్ తల్లీబిడ్డల ఆరోగ్య సంరక్షణే ధ్యేయంగా స్థానిక అంగన్‌వాడీ కేంద్రంలో 'ఉత్సవ సేవా సంకల్ప అభియాన్' వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సదస్సులో అంగన్‌వాడీ సెక్టార్ సూపర్వైజర్ నూతక్కి సత్య శ్రీ మాట్లాడుతూనిత్య జీవితంలో పోషకాహార ప్రాధాన్యతను గుర్తించి, మహిళలు తమ ఆరోగ్య పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని పిలుపునిచ్చారు. ఈ అభియాన్ లో భాగంగా కేంద్రంలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం లబ్ధిదారులకు ప్రభుత్వ పోషకాహార కిట్లను పంపిణీ చేశారు. చిన్నారుల ఎదుగుదలకు, గర్భిణుల సంరక్షణకు అంగన్‌వాడీ సేవలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అంగన్వాడి కేంద్ర నిర్వాహకురాలు యార్లగడ్డ లావణ్య ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సిబ్బంది, తల్లులు పాల్గొన్నారు.

## మంగినపూడిలో 63 అడుగుల మహాగణపతి నిమజ్జనం



మచిలీపట్నం శ్రీవార్త న్యూస్ మచిలీపట్నం మంగినపూడి సముద్ర తీరంలో ప్రతిష్ఠించిన 63 అడుగుల మహాగణపతి నిమజ్జన కార్యక్రమం భక్తిశ్రద్ధలతో, కోలాహలంగా



నిర్వహించారు.కృష్ణా జిల్లా తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి గోపు సత్యనారాయణ తెలిపిన వివరాల ప్రకారం, మహాగణపతి వద్ద నిర్వహించిన లడ్డూ వేలంపాటలో విజేతలకు లడ్డూను అందజేశారు. అనంతరం మహా అన్నదాన కార్యక్రమంలో పాల్గొని భక్తులకు అన్నప్రసాదం అందించారు.అనంతరం డప్పు వాయిద్యాలు, భక్తుల జయజయధ్వానాల మధ్య మహాగణపతి నిమజ్జన కార్యక్రమంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.మంగినపూడిలో మహాగణపతి దర్శనానికి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారని, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నిర్వాహకులు చేసిన ఏర్పాట్లు అభినందనీయమని గోపు సత్యనారాయణ తెలిపారు. ప్రజలందరిపై విఘ్నేశ్వరుడి ఆశీస్సులు ఉండాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో మంత్రివర్యులు కొల్లు రవీంద్ర, విజయ డెయిరీ చైర్మన్ దాసరి బాలవర్ధన్ రావు, కృష్ణా జిల్లా టీడీపీ ప్రధాన కార్యదర్శి గోపు సత్యనారాయణ తో పాటు పలువురు కూటమి నాయకులు, కార్యకర్తలు, నిర్వాహకులు, భక్తులు పాల్గొన్నారు.

## గణనాధునకు పూజలు చేస్తున్న శేఖరు దంపతులు

### గణనాధునికి వైభవంగా పూజలు



అవనిగడ్డ సెప్టెంబర్ 25 శ్రీ వార్త అవనిగడ్డ 6వ వార్డులోనే చింతలపూడి వారి బజార్లో చవితి ఉత్సవాల్లో భాగంగా ఏర్పాటు చేసిన గణనాధునికి 12వ రోజు శుక్రవారం చింతలపూడి శేఖర్, వీర మల్లేశ్వరి దంపతులు పూజలు నిర్వహించారు అర్చక స్వాములు బృందావన వేణుగోపాల మంత్రాచారణతో ప్రత్యేక పూజలు నిర్వహించారు ఈ సందర్భంగా గణనాథుని భక్తులు పెద్ద ఎత్తున దర్శించుకోగా శేఖర్ దంపతులు భక్తిశ్రద్ధలతో భక్తులకు తీర్థ ప్రసాదములను అందజేశారు.

## విధులలో జాయిన్ అయినా ప్రత్యేక అధికారి బాధ్యతలు స్వీకరిస్తున్న ప్రత్యేక అధికారి పి విష్ణు



అవనిగడ్డ సెప్టెంబర్ 25 శ్రీ వార్త అవనిగడ్డ మండల పరిషత్ ప్రత్యేక అధికారిగా పి. విష్ణు విధులలో చేరారు. ఆయన మచిలీపట్నం అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ లేబర్గా పనిచేస్తూ శుక్రవారం మండల పరిషత్ ప్రత్యేక అధికారిగా బాధ్యతలు చేపట్టేందుకు రాగా ఆయనకు ఎంపీడీవో ఎం. వనజ డిప్యూటీ ఎంపీడీవోలు డి. చంద్రశేఖర్, కె. పద్మావతి స్వాగతం పలికి పుష్ప గుచ్చం ఇచ్చి శాలువాతో సత్కరించారు.

## నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే సింహాద్రి

### రాజశేఖర్ కి ఘన నివాళులు



అవనిగడ్డ సెప్టెంబర్ 25 శ్రీ వార్త మాజీ లిడ్ క్యాప్ చైర్మన్ మరియు వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రచార విభాగం అధ్యక్షులు కాకుమాను రాజశేఖర్ గురువారం ఉదయం తెల్లవారుజామున గుండెపోటు కారణంగామరణించారు, ఈరోజు ఉదయం అవనిగడ్డ వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయం నందు శుక్రవారం ఉదయం రాజశేఖర్ చిత్ర పటానికినియోజకవర్గం మాజీ శాసనసభ్యులు వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త మరియు వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర రైతు విభాగం రీజనల్ వర్కింగ్ ప్రెసిడెంట్ సింహాద్రి రమేష్ బాబు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించి రాజశేఖర్ ఆత్మకు శాంతి చేకూరాలని, వారి కుటుంబానికి ఈ తీరని శోకాన్ని తట్టుకునే మనోధైర్యాన్ని ఆ భగవంతుడు ప్రసాదించాలని అన్నారుఈ కార్యక్రమంలో అవనిగడ్డ జడ్పీటీసీ మరియు కృష్ణాజిల్లా వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా విభాగం అధ్యక్షులు చింతలపూడి లక్ష్మీనారాయణ(లచ్చి), కృష్ణాజిల్లా వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ పంచాయతీరాజ్ విభాగం అధ్యక్షులు సింహాద్రి వెంకటేశ్వరరావు, అవనిగడ్డ మండలం వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రేపల్లె శ్రీనివాసరావు, అవనిగడ్డ మాజీ ఉప సర్పంచ్ మరియు రాష్ట్ర వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ప్రచార విభాగం కార్యదర్శి గాజుల జయ గోపాల్(గోపి), అవనిగడ్డ మాజీ సర్పంచ్ మరియు కృష్ణాజిల్లా వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ క్రిస్టియన్ మైనార్టీ సెల్ విభాగం ఉపాధ్యక్షులు నలుకుర్తి పృథ్విరాజ్, అవనిగడ్డ నియోజకవర్గం వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ యువజన విభాగం అధ్యక్షులు చింతలపూడి బాల భాస్కరరావు(బాలు), అవనిగడ్డ 4వ సెగ్మెంట్ మాజీ ఎంపీటీసీ తోట గణేష్, అవనిగడ్డ మండలం వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు గార్లపాటి గోపి, వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సింహాద్రి రామచంద్రరావు, వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కొల్లాల మధు, సింహాద్రి రాజా, షేక్ రియాజ్ భాషా, మావిడిబత్తిన ఫణి మరియు పార్టీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొని రాజశేఖర్ చిత్ర పటానికి నివాళులర్పించారు

## గ్రామాల అభివృద్ధికి డిప్యూటీ సీఎం కొణిదెల పవన్ కళ్యాణ్ కృషి



శ్రీ వార్త న్యూస్ కోడూరు నియోజకవర్గ యువనాయకులు మండలి వెంకట్రామ్‌పిట్టల్లంకలో పవన్ కళ్యాణ్ చిత్రపటానికి పాలాభిషేకం,రోడ్డు నిర్మాణానికి రూ.కోటీ 26 లక్షల 50వేలు మంజూరు పట్ల హర్షంకోడూరు: పంచాయతీరాజ్ శాఖ ద్వారా గ్రామాల అభివృద్ధికి డిప్యూటీ సీఎం కొణిదెల పవన్ కళ్యాణ్ కృషి చేస్తున్నారని నియోజకవర్గ యువనాయకులు మండలి వెంకట్రామ్ అన్నారు. శుక్రవారం కోడూరు మండలం పిట్టల్లంక గ్రామంలో డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ చిత్రపటానికి గ్రామస్థులు పాలాభిషేకం చేశారు. జనసేన పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వెంకట్రామ్ విచ్చేసి గ్రామస్థులు, నాయకులతో కలిసి డిప్యూటీ సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. నారేపాలెం నుంచి పిట్టల్లంక వయా బడేవారిపాలెం 2.700 కిలోమీటర్లు ప్రధాన రహదారి నిర్మాణానికి డిప్యూటీ సీఎం సహకారంతో ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ ప్రత్యేక శ్రద్ధతో రూ.కోటీ 26 లక్షల 50వేలు మంజూరు చేయటం పట్ల గ్రామస్థులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా మండలి వెంకట్రామ్ మాట్లాడుతూ పేద ప్రజల అవసరాలు గుర్తించి తీర్చటంలో డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ప్రతిసారి సమర్థవంతంగా స్పందించి సౌకర్యాలు కల్పిస్తూ ప్రజల ఆదరాభిమానాలు పొందుతున్నారని తెలిపారు. గ్రామాల వికాసానికి కీలకమైన మౌలిక సౌకర్యాల కల్పనకు పవన్ కళ్యాణ్ అత్యధిక ప్రాధాన్యత ఇచ్చి కృషి చేస్తున్నారని తెలిపారు. గ్రామీణ అభివృద్ధికి కృషి చేస్తున్న ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కు సహకరిస్తున్న ప్రధాని నరేంద్ర మోడీ, సీఎం చంద్రబాబుకు ధన్యవాదములు తెలిపారు. కార్యక్రమంలో జనసేన పార్టీ మండల అధ్యక్షులు మర్రె గంగయ్య, మాజీ సర్పంచ్ కనగాల వెంకటేశ్వరరావు, మాజీ ఉప సర్పంచ్ బావిశెట్టి ప్రభాకర్, కోడూరు టౌన్ పార్టీ



అధ్యక్షులు కోట రాంబాబు, సొసైటీ చైర్మన్ పూతబోయిన కరుణ కుమార్, గ్రామ పార్టీ అధ్యక్షులు కంచర్లపల్లి రమణ, మాజీ డీసీ వైస్ చైర్మన్ కాగిత రామారావు, దేవస్థానం చైర్మన్ బండే కొండలరావు, జనసేన పార్టీ నాయకులు పూతబోయిన సీతా రత్న సాయిబాబు, బడే వెంకట్రావు, తోట రాజేష్, బచ్చు వెంకటేష్, సనకా జగన్, కడవకొల్లు శ్రీను, మాజీ వార్డు సభ్యులు కొల్లూరు కోటేశ్వరరావు, నడకుదుటి రత్నాంజనేయులు, కొప్పుల నరసింహా, కోట వెంకటేశ్వరరావు, పెద్దసంఖ్యలో గ్రామస్థులు పాల్గొన్నారు

# గూడెం గ్రామంలో భక్తి శ్రద్ధలతో గణనాథుడి నిమజ్జనం కార్యక్రమం

సనాతన ధర్మ యూత్ కమిటీ ఆధ్వర్యంలో



చిన్నంబావి సెప్టెంబర్ 25 (:వనపర్తి జిల్లా చిన్నంబావి మండల కేంద్రంలోని గూడెం గ్రామంలో సనాతన ధర్మ యూత్ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో నిర్వహించిన వినాయక చవితి ఉత్సవాలు భక్తిశ్రద్ధల మధ్య ఘనంగా ముగిశాయి. ఈ ఉత్సవాల్లో భాగంగా ప్రతిష్ఠించిన వినాయకుడి విగ్రహానికి ప్రత్యేక పూజలు నిర్వహించి, అనంతరం నిమజ్జన కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు.వినాయక నిమజ్జనోత్సవం సందర్భంగా గ్రామంలో భక్తుల సందడి నెలకొంది. యువత, భక్తులు ఉత్సాహంగా పాల్గొని గణనాథుడికి వీడ్కోలు పలికారు. భక్తుల జయజయధ్వానాలు, వినాయక నామస్మరణలతో గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది."భక్తి.. శ్రద్ధ.. ఐక్యతకు ప్రతీకగా ఉత్సవాలు" సనాతన ధర్మ యూత్ కమిటీ సభ్యులు మాట్లాడుతూ.. గ్రామంలో ప్రతి సంవత్సరం వినాయక చవితి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ ఏడాది కూడా కమిటీ సభ్యులు, యువత సమన్వయంతో ఉత్సవాలను విజయవంతంగా నిర్వహించి, చివరగా గణనాథుడి నిమజ్జన కార్యక్రమాన్ని ఘనంగా పూర్తి చేశామని పేర్కొన్నారు. వినాయక చవితి ఉత్సవాలు గ్రామ ప్రజల్లో భక్తిభావంతో పాటు ఐక్యత, సోదరభావాన్ని పెంపొందించేలా సాగాయని కమిటీ సభ్యులు తెలిపారు. నిమజ్జన కార్యక్రమంలో గ్రామ ప్రజలు, యువత, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని గణనాథుడికి ఘనంగా వీడ్కోలు పలికారు. ఇట్టి కార్యక్రమంలో సనాతన ధర్మ యూత్ కమిటీ సభ్యులు మద్దూరి నాగరాజు కుటుంబ సభ్యులు, మధకం కురుమయ్య కుటుంబ సభ్యులు, తోట బాలకృష్ణ కుటుంబ సభ్యులు, మేకల శివుడు కుటుంబ సభ్యులు, మద్దూరి ప్రవీణ్ కుటుంబ సభ్యులు, మేకల సతీష్ యాదవ్ కుటుంబ సభ్యులు, గొందిపర్ల మూర్తి బాలకృష్ణ బాలపీరు కుటుంబ సభ్యులు, మద్దూరి సత్తయ్య కుటుంబ సభ్యులు అందరూ కలిసి కార్యక్రమాన్ని విజయవంతంగా చేశారు.

# ప్రజా భవన్ నుంచి వచ్చిన ఫైల్ ఎక్కడుంది..? ఆసిఫాబాద్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలోనే అంతుచిక్కని జాడ!

ఇన్వార్డ్ సెక్షన్‌లో ఫైళ్ల కదలికలపై రైతుల ప్రశ్నలు.. ఆర్టీఐతో వెలుగులోకి రానున్న అసలు వివరాలు




కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా సెప్టెంబర్ 25 ఆఆసిఫాబాద్: కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని ఇన్వార్డ్ సెక్షన్‌లో ఫైళ్ల నిర్వహణపై రైతులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. తమ సమస్యల పరిష్కారం కోసం హైదరాబాద్‌లోని తెలంగాణ రాష్ట్ర ప్రజా భవన్, ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయంలో దరఖాస్తులు సమర్పించినా, అవి జిల్లా కలెక్టర్ కార్యాలయానికి చేరిన తర్వాత వాటి కదలికలు స్పష్టంగా తెలియక రైతులు కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి ఏర్పడుతోందని వాపోతున్నారు. 25.08.2026న ప్రజా భవన్‌లో భూమి సమస్యపై సమర్పించిన దరఖాస్తును సంబంధిత అధికారులు ఆసిఫాబాద్ జిల్లా కలెక్టర్ కార్యాలయానికి పంపగా, 08.09.2026న దరఖాస్తుదారు ఫైల్‌ను జిల్లా కార్యాలయంలో సమర్పించారు. అయితే ఆ తర్వాత ఫైల్ ఏ విభాగానికి వెళ్లింది, ఎవరు స్వీకరించారు, ఏ అధికారి పరిశీలించారు, ప్రస్తుతం ఎవరి వద్ద ఉంది అనే వివరాలపై స్పష్టత లేకపోవడంతో ప్రశ్నలు తలెత్తుతున్నాయి.ఇన్వార్డ్ సెక్షన్‌లో ఫైల్ గురించి అడిగితే ఒకసారి ఒక అధికారి వద్ద ఉందని, మరోసారి మరో విభాగంలో ఉందని చెబుతున్నారని రైతులు పేర్కొంటున్నారు. దీంతో తమ సమస్య ఎప్పుడు పరిష్కారమవుతుందో తెలియక ఇబ్బందులు పడుతున్నామని చెబుతున్నారు. ఫైల్ జిల్లా కలెక్టర్ పరిశీలనకు వెళ్లిందా? మధ్యలోనే ఎక్కడైనా నిలిచిపోయిందా? సంబంధిత రిజిస్టర్లలో ఫైల్ కదలికలు నమోదయ్యాయా? అనే అంశాలు ఇప్పుడు చర్చనీయాంశంగా మారాయి.ఈ నేపథ్యంలో ఫైల్ అసలు ఎక్కడి నుంచి ఎక్కడికి వెళ్లిందో, ఎవరి వద్ద ఎంతకాలం ఉందో, ఏ ఆదేశాలు జారీ అయ్యాయో, ఫైల్ నోటింగులు ఏమిటో, ప్రస్తుత స్థితి ఏమిటో తెలుసుకునేందుకు సమాచార హక్కు చట్టం కింద 15 అంశాలతో సమాచారం కోరుతున్నారు. డైరీ, ఇన్వార్డ్, డిస్పాచ్, ఫైల్ మూవ్‌మెంట్ రిజిస్టర్లలోని సంబంధిత నమోదుల ధృవీకరించిన ప్రతులతో పాటు, ఫైల్ నోటింగులు, ఆదేశాలు, నివేదికలు, ఎండార్స్‌మెంట్లు మరియు అందుబాటులో ఉన్న సీసీ కెమెరా రికార్డుల వివరాలను కూడా కోరుతున్నారు.ఫైళ్ల కదలికలపై స్పష్టత కల్పించి, రైతులను కార్యాలయాల చుట్టూ తిప్పకుండా సంబంధిత అధికారులు బాధ్యతగా వ్యవహరించాలని రైతులు కోరుతున్నారు. జిల్లా కలెక్టర్ స్పందించి ఇన్వార్డ్ సెక్షన్‌లో ఫైళ్ల నిర్వహణపై సమగ్రంగా పరిశీలించి, తప్పిదాలు ఉంటే సంబంధిత అధికారులపై తగిన చర్యలు తీసుకుని బాధిత రైతులకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

# అంతర్జాతీయ ఫార్మాసిస్ట్ దినోత్సవం సందర్భంగా సాకార సంఘం చైర్మన్ ఇప్ప శ్రీనివాస్ రెడ్డి చిరు సన్మానం




చొప్పదండి మండలం, సెప్టెంబర్ 25: అంతర్జాతీయ ఫార్మాసిస్ట్ దినోత్సవాన్ని పురస్కరించుకుని ౹ాజూ ఆధ్వర్యంలో ఫార్మాసిస్టులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారి సేవలను అభినందిస్తూ శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో సాకార సంఘం వైస్ చైర్మన్ నిజనాపురం చందు, మున్సిపల్ చైర్మన్ సరిత శ్రీనివాస్, మున్సిపల్ వైస్ చైర్మన్ పెరుమండ్ల మానస గంగయ్య, కౌన్సిలర్ ముద్దం తిరుపతి, సీఈఓ సొసైటీ తిరుపతి రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఫార్మాసిస్టులు ప్రజల ఆరోగ్య పరిరక్షణలో అందిస్తున్న సేవలు అభినందనీయమని వారు పేర్కొన్నారు. ప్రజలకు నాణ్యమైన ఔషధ సేవలు అందించడంలో ఫార్మాసిస్టుల పాత్ర కీలకమని తెలిపారు.

# యూనిటీ ఫార్మసీ కళాశాలలో ఘనంగా వరల్డ్ ఫార్మసిస్ట్ డే




భువనగిరి సెప్టెంబర్ 25 భువనగిరి పట్టణ పరిధిలో గల యూనిటీ ఫార్మసీ కళాశాలలో వరల్డ్ ఫార్మసిస్ట్ డే ఘనంగా జరిగాయి.ఈ సందర్భంగా ర్యాలీ,ఫార్మా క్విజ్ మరియు వ్యాస రచన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అంపటి శ్రీనివాస్ మాట్లాడుతూఏంటి మైక్రోబియల్ మందులను తెలియకుండా వాడడం వల్ల చాలా నష్టాలు ఉన్నాయని మనం తీసుకునే ట్రీట్మెంట్ ఫెయిల్ కావచ్చుని, సైడ్ ఎఫెక్ట్స్ ఎక్కువగా కావచ్చుని, వ్యాధి నిరోధక శక్తి తగ్గిపోతుంది అని అలాగే దీనివల్ల కుటుంబం మరియు సమాజం మీద కూడా ప్రభావం ఉంటుందని కావున వైద్యుల సలహా మీద ఏ వ్యాధికి ఏ మందు వాడాలో తెలుసుకున్న తర్వాతనే వాడాలని పేర్కొన్నారు.ఈ కార్యక్రమం లో కళాశాల చైర్మన్ శ్రీ ప్రభాకర్ రెడ్డి కళాశాల డైరెక్టర్ సోమ చంద్, గోవర్ధన్ రెడ్డి , యూనిటీ పిజి కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సరిత, కళాశాల ఏ ఓ శ్రీమతి సునీత ,రాజీవ్, ఎండీ ఇస్మాయిల్, షేక్ అహ్మద్, అనిత, పారిజాత, అమర్నాథ్, అమూల్య, ప్రియాంక, నాగరాజు, మహేష్, బాలరాజు, మోహిని, శ్వేత, శైలజ,ఉమ, రవీందర్, కృష్ణ, మల్లేష్ మరియు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

# రైతుల సంక్షేమమే ప్రజా ప్రభుత్వ లక్ష్యం ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య



యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్ట సెప్టెంబర్ 25 పిఏసిఎస్ ల బలోపేతానికి 5 వేల మెట్రిక్ టన్నుల సామర్థ్యంతో గోదాముల నిర్మాణంధాన్యం కొనుగోలు చేసిన 48 గంటల్లోనే రైతుల ఖాతాల్లో నగదు జమ ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్యలియాదగిరిగుట్ట మండలంయాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్ట మండల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన అర్ధవార్షిక మహాజనసభ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా కార్యకలాపాలు, రైతులకు అందుతున్న సేవలు, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, వ్యవసాయ రంగ అభివృద్ధికి చేపడుతున్న కార్యక్రమాలపై ఆయన వివరించారు.ఈ సందర్భంగా బీర్ల అయిలయ్య మాట్లాడుతూ గ్రామస్థాయిలో రైతులకు నేరుగా సేవలు అందించే ముఖ్యమైన వ్యవస్థలు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు అని తెలిపారు. రైతులకు అవసరమైన రుణాలు, వ్యవసాయ సంబంధిత సేవలు, ధాన్యం కొనుగోళ్లు తదితర కార్యక్రమాల్లో లు కీలక పాత్ర పోషిస్తున్నాయని అన్నారు.రైతుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని ప్రజా ప్రభుత్వం అనేక కార్యక్రమాలను అమలు చేస్తోందని ఆయన తెలిపారు. రైతు రుణమాఫీ, రైతు భరోసా, రైతు బీమా వంటి పథకాలు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. రైతులకు ఆర్థిక భరోసా కల్పించడంతో పాటు వ్యవసాయ రంగాన్ని మరింత బలోపేతం చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోందన్నారు.ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలను మరింత బలోపేతం చేయడంలో భాగంగా ప్రతి పరిధిలో గోదాముల నిర్మాణానికి ప్రభుత్వం చర్యలు చేపడుతోందని బీర్ల అయిలయ్య తెలిపారు. ప్రతి పిఏసిఎస్ కు 5 వేల మెట్రిక్ టన్నుల సామర్థ్యంతో గోదాములను నిర్మించనున్నట్లు వెల్లడించారు.గోదాముల నిర్మాణానికి అవసరమైన భూసేకరణ ప్రక్రియ కూడా పూర్తి చేసినట్లు తెలిపారు. రైతులు పండించిన ధాన్యాన్ని నిల్వ చేసుకోవడానికి, పంట ఉత్పత్తులకు మెరుగైన మార్కెటింగ్ సదుపాయాలు కల్పించడానికి ఈ గోదాములు ఉపయోగపడతాయని అన్నారు.పి సి ఎస్ ల ద్వారా ధాన్యం కొనుగోళ్లను మరింత సమర్థవంతంగా నిర్వహిస్తున్నామని బీర్ల అయిలయ్య తెలిపారు. రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేసిన అనంతరం 48 గంటల్లోనే రైతుల బ్యాంకు ఖాతాల్లో నగదు జమ చేసే విధంగా చర్యలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు.రైతులు పండించిన పంటకు సకాలంలో చెల్లింపులు అందేలా ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోందని అన్నారు. రైతులు దళారులపై ఆధారపడకుండా ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలు, బ్యాంక్ ల ద్వారా తమ పంటను విక్రయించుకునేలా అవసరమైన సదుపాయాలను కల్పిస్తున్నామని తెలిపారు.రైతుల సంక్షేమం, వ్యవసాయ రంగ అభివృద్ధే ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని బీర్ల అయిలయ్య తెలిపారు. రైతులకు ఆర్థిక భరోసా కల్పించడంతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందన్నారు.ఆలేరు నియోజకవర్గంలో రైతులు, గ్రామీణ ప్రజలకు అవసరమైన అభివృద్ధి కార్యక్రమాలను దశలవారీగా చేపడుతున్నామని తెలిపారు. ప్రభుత్వ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరేలా ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. పిఏసిఎస్ లను రైతులకు మరింత చేరువగా తీసుకెళ్లి, వాటి ద్వారా అందించే సేవలను విస్తరించాలని ఆయన అన్నారు. రైతుల సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి కృషి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు.ఈ ప్రజా ప్రభుత్వంలో మరోసారి గోదావరి జలాలను వినియోగించి ఆలేరు నియోజకవర్గంలోని అన్ని చెరువులు, వాగులను నింపేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.ప్రస్తుతం పసిఫిక్ మహాసముద్రంలో ఏర్పడిన ఎల్‌నినో ప్రభావంతో వర్షపాతం తగ్గడం వల్ల తాగునీరు, సాగునీటి కొరత ఏర్పడిందని ఆయన పేర్కొన్నారు. రైతులు, ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం అవసరమైన చర్యలు తీసుకుంటుందని తెలిపారు.ఆలేరు నియోజకవర్గంలోని చెరువులు, వాగులు మరోసారి నీటితో కళకళలాడేలా గోదావరి జలాలను తరలించేందుకు కృషి చేస్తామని, తాగునీటితో పాటు సాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా ప్రభుత్వం ముందుకు సాగుతుందని బీర్ల అయిలయ్య స్పష్టం చేశారు.ఈ మహాజనసభలో పిఏసిఎస్ పాలకవర్గ సభ్యులు, అధికారులు, వ్యవసాయ శాఖ అధికారులు, సహకార శాఖ సిబ్బంది, రైతులు, స్థానిక ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# 29న జరిగే, మాదిగల ఆత్మీయ సమ్మేళనం జయప్రదం చేయండి

ఇంజ మహేష్ మాదిగ



రాజపేట సెప్టెంబర్ 25 ఆర్టిఐ ఎక్స్ప్రెస్ న్యూస్ యాదాద్రి భువనగిరి జిల్లా రాజపేట మండలంలో ఈనెల 29న రాజపేట మండలంలో జరిగే మాదిగల ఆత్మీయ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని ఇంజ మహేష్ మాదిగ అన్నారు. రాజపేట మండలంలో, ఈనెల 29 మంగళవారం రోజు ఉదయం 10 గంటలకు మాదిగ ప్రజాప్రతినిధులకు సన్మాన కార్యక్రమం, మాదిగల ఆత్మీయ సమ్మేళనానికి ముఖ్య అతిథులుగా: ఉన్నత విద్యా మండలి వైస్ చైర్మన్, ప్రొఫెసర్ ఇటిక్యాల పురుషోత్తం, మామిడి గళ్ళ జాన్ బాబు, మీర్పేట్ మాజీ కార్పొరేటర్ గొల్లూరి అంజయ్య, భువనగిరి మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ బర్రె జాంగిర్, పీపుల్స్ మానిటరింగ్ కమిటీ రాష్ట్ర చైర్మన్, శివలింగం, పాకాల క్రిష్టఫర్ హాజరవుతున్నందున రాజాపేట మండల అన్ని పార్టీలకు అతీతంగా.. అందరూ మాదిగలు హాజరై మాదిగ ఆత్మీయ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో, మాజీ వైస్ ఎంపీపి, రామ్ గొల్ల కృష్ణ, మాదిగ, సర్పంచుల ఫోరం మండల వైస్ ప్రెసిడెంట్ నడిమింటి నరేష్ మాదిగ, మాజీ ఎంపిటిసి కొమ్ము పాండు మాదిగ, కొమ్ము ప్రకాష్, దగ్గుల విష్ణు, రఘునాథ్ పూర్ ఉపసర్పంచ్, కళ్యాణి రాజు, నరసాపురం ఉపసర్పంచ్, నారపాక కరుణాకర్ ,కొలిపాక యాదగిరి, కలకుంట్ల పోచయ్య, ముక్క రవి ప్రకాష్, కొమురయ్య, సుధాకర్, భూపతి కిషన్ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా నమామి భారతం.. వందేమాతరం గేయాలాపన




మంథని, 25 సెప్టెంబర్ పెద్దపల్లి జిల్లా మంథని పట్టణంలో విద్యా భారతి అఖిల భారతీయ శిక్షా సంస్థాన్, న్యూఢిల్లీ ఆధ్వర్యంలో 'నమామి భారతం.. వందేమాతరం' గేయాలాపన కార్యక్రమాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. వందేమాతరం గేయం 150 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా శ్రీ సరస్వతీ శిశు మందిర్ ఆధ్వర్యంలో కాకతీయ పాఠశాల, అలోక్ పబ్లిక్ స్కూల్, కృష్ణవేణి పాఠశాలల్లో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా పాఠశాలల విద్యార్థులతో పాటు మంథని పట్టణంలోని వివిధ పాఠశాలలు, కళాశాలలకు చెందిన విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని పూర్తి వందేమాతరం గేయాన్ని ఆలపించారు. దేశభక్తి భావాన్ని పెంపొందించే ఉద్దేశంతో నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసిన విద్యార్థులు, పాఠశాలల యాజమాన్యాలు, ఉపాధ్యాయులకు శ్రీ సరస్వతీ శిశు మందిర్ ప్రధానోపాధ్యాయురాలు నాంపల్లి సంధ్య ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల కార్యదర్శి మాడిశెట్టి సురేందర్, సమితి కార్యదర్శి కనుకుట్ల స్వామి, కమిటీ సభ్యులు కొమురవెల్లి కిరణ్, రావుల సతీష్, కొత్త శ్రీనివాస్, పూర్వ ఆచార్యులు కొమురవెల్లి హరీష్, మాతృ మండలి సభ్యురాలు భూపతి రత్నాంజలి, మాతాజీలు, పోషకులు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

# ఆర్టీఐ సమాచారానికి సమాధానం ఏది?

కాగజ్ నగర్ ఎఫ్‌డీఓ అధికారికి ప్రథమ అప్పీల్.. పూర్తి సమాచారం ఉచితంగా ఇవ్వాలని డిమాండ్

ఏప్రిల్ 13న దరఖాస్తు.. ఇప్పటికీ పూర్తి వివరాలు అందలేదని ఫిర్యాదు -- సెక్షన్ 20(1), (2) ప్రకారం బాధ్యత పరిశీలించాలని విజ్ఞప్తి




కాగజ్ నగర్ సెప్టెంబర్ 25 ఆ కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లాలోని కాగజ్‌నగర్ మండలంలోని ఎఫ్‌డీఓ కార్యాలయంలో సమాచార హక్కు చట్టం అమలు తీరుపై ప్రశ్నలు తలెత్తుతున్నాయి. కౌటాల మండలం తాటినగర్‌కు చెందిన ఆర్టీఐ కార్యకర్త దుర్గం శరత్ చంద్ర, ఏప్రిల్ 13, 2026న ఎఫ్‌డీఓ కార్యాలయ ప్రజా సమాచార అధికారికి సమర్పించిన సమాచార దరఖాస్తుపై పూర్తి సమాచారం అందలేదని పేర్కొంటూ ప్రథమ అప్పీల్ దాఖలు చేశారు. సమాచార హక్కు చట్టంలోని సెక్షన్ 19.1 ప్రకారం ఎఫ్‌డీఓ ప్రథమ అప్పిలేట్ అధికారిని ఆశ్రయించిన ఆయన, తాను కోరిన ప్రతి అంశానికి పాయింట్ల వారీగా స్పష్టమైన సమాధానాలు, సంబంధిత దస్త్రాలు, రికార్డులు, పత్రాల ప్రతులు అందించాలని కోరారు.తన పరిధిలో లేని అంశాలుంటే సెక్షన్ 6.3 ప్రకారం సంబంధిత ప్రజా సమాచార అధికారులకు బదిలీ చేసి, ఆ వివరాలను తనకు తెలియజేయాల్సిన బాధ్యత ఉందని అప్పీలులో పేర్కొన్నారు. నిర్ణీత కాలపరిమితిలో సమాచారం అందించకపోతే సెక్షన్ 7.6 ప్రకారం సమాచారాన్ని ఉచితంగా అందించాలని కోరారు. అలాగే సమాచారాన్ని అధిక పేజీలలో ఉందనే కారణంతో నిరాకరించేందుకు సెక్షన్ 7.9ను ఉపయోగించరాదని స్పష్టం చేశారు.ప్రజా సమాచార అధికారి ఉద్దేశపూర్వకంగా ఆలస్యం చేసినా, తప్పు లేదా అసంపూర్ణ సమాచారం ఇచ్చినా విచారణ జరిపి, పరిస్థితులు నిర్ధారణైతే సమాచార హక్కు చట్టంలోని సెక్షన్ 20.1, 2 ప్రకారం తగిన చర్యల అంశాన్ని పరిశీలించాలని శరత్ చంద్ర కోరారు. అప్పీల్‌పై విచారణ నిర్వహించి, తుది నిర్ణయాన్ని కారణాలతో సహా లిఖితపూర్వకంగా అందించాలని విజ్ఞప్తి చేశారు."

# ఖాజ్ పల్లిలో అమ్మవారికి కుంకుమార్చనలు

భారీగా మహిళలు హాజరు





జిన్నారం కాజ్ పల్లి శ్రీ వార్త ప్రత్యేక ప్రతినిధి )ఈరోజు గణపతి నవరాత్రుల 12 వ రోజైన శుక్రవారం జిన్నారం రూరల్ మండలం ఖాజ్ పల్లి శ్రీ సాయి కౌంటీలో గణపతికి విశేషంగా పూజలు నిర్వహించారు. ఈ రోజు మహిళలకు ఇష్టమైన శుక్రవారం కావడంతో లక్ష్మీ గణపతి హోమాలు, కుంకుమర్చనలు నిర్వహించారు. అమ్మ వారికి కుంకుమార్చన చేస్తే సకల శుభాలు కలుగుతాయని పండితులు పేర్కొన్నారు.అమ్మవారికి చేసే కుంకుమ పూజ (కుంకుమార్చన) శక్తి ఆరాధనలో అత్యంత పవిత్రమైన మరియూ విశిష్టమైన పూజ మహిళలకు విశిష్టమైనది. లక్ష్మీ గణపతి హోమం, లక్ష్మీ దేవికి కుంకుమర్చనలు చేస్తే సకల శుభాలు కలుగుతాయని మహిళల విశ్వాసం. అమ్మవారి 108 (అష్టోత్తరం) లేదా 1008 (సహస్ర నామాలు) నామాలను జాపిస్తూ, ప్రతి నామానికి చిటికెడు కుంకుమతో అమ్మవారిని అర్చిస్తారు. మనసులో కోరికను తలచుకొని పూజను ప్రారంభిస్తున్నట్లు సంకల్పం చెప్పుకోవాలి. ప్రతి శుక్రవారం, మంగళవారము, పౌర్ణమి, అమావాస్య, మరియూ ముఖ్యంగా దేవి నవరాత్రుల సమయంలో ఈ కుంకుమర్చనచేయడం అత్యంత పుణ్య ఫలాన్ని ఇస్తుంది.

# సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌పై సుప్రీంలో పిల్





ఢిల్లీ: సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌పై విచారణ జరపాలని సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలైంది. ఎస్ఐఆర్‌లో అవకతవకలు, ఓటర్ల జాబితాలో అక్రమాలకు పాల్పడ్డారని పిటిషన్‌లో పేర్కొన్నారు. ఏకపక్షంగా ఫారం 6లో మార్పులను ఇద్దరు ఎన్నికల కమిషనర్లు వ్యతిరేకించిన నేపథ్యంలో విచారణ జరపాలని పిటిషన్‌లో అభ్యర్థించారు. జ్ఞానేష్ కుమార్ ఏకపక్ష నిర్ణయాల వల్ల అర్హులైన ఓటర్లు తమ ఓటు హక్కు కోల్పోయారని పిటిషనర్ పేర్కొన్నారు. మరోవైపు, జ్ఞానేశ్ కుమార్‌ను బాధ్యతల నుంచి తొలగించేందుకు లోక్‌సభ, రాజ్యసభలో తీర్మానం చేయాలని కోరుతూ త్వరలోనే ప్రతిపక్షాలు మరోసారి నోటీసు ఇవ్వనున్నట్లు సమాచారం. జ్ఞానేశ్ కుమార్‌ను తొలగించాలంటూ ప్రతిపక్షాలు చేస్తున్న మూడో ప్రయత్నమిది కావడం గమనార్హం. న్యాయ నిపుణుల అభిప్రాయం తీసుకుని రూపొందించే ఈ నోటీసును వచ్చే వారం పార్లమెంట్ ఉభ య సభల్లో అందజేసే అవకాశాలున్నాయని విశ్వసనీయ వర్గాలు చెబుతున్నాయి. ఇద్దరు కమిషనర్లు లేవనెత్తిన అభ్యంతరాలను పట్టించుకోకుండానే ప్రధాన ఎన్నికల కమిషనర్, స్వతంత్రంగా నిర్ణయాలు తీసుకుంటున్నారని 'ఇండియన్ ఎక్స్‌ప్రెస్'ప్రచురించిన పరిశోధనాత్మక కథనం దేశవ్యాప్తంగా రాజకీయ దుమారం రేపిన సంగతి తెలిసిందే. గత పది నెలల కాలంలో ఎన్నికల కమిషనర్లు సుఖ్‌బీర్ సింగ్ సంధూ, వివేక్‌జోషీలు మొత్తం 14 సార్లు వివిధ నిర్ణయాలపై తమ అభ్యంతరాలను లిఖితపూర్వకంగా వ్యక్తం చేశారని, అనధికారిక, అక్రమ ఉత్తర్వులంటూ తెలిపినప్పటికీ ఆ నిర్ణయాలు అమలయ్యాయని ఈ కథనం ఆరోపించింది.

# ఎయిరిండియా పైలట్ సస్పెన్షన్.. ఏం జరిగిందంటే..?




ఢిల్లీ: జ్యూరిక్ విమానాశ్రయంలో ఢిల్లీకి విమానం బయలుదేరే ముందు నిర్వహించిన ఆల్కహాల్ పరీక్షలో ఫెయిలైన ఎయిర్ ఇండియా సహ పైలట్‌ను అధికారులు సస్పెండ్ చేశారు. సెప్టెంబర్ 6న జరిగిన ఈ ఘటన జరిగింది. జ్యూరిక్ నుంచి ఢిల్లీకి రావాల్సిన విమానానికి చెందిన కో-పైలట్ మద్యం సేవించినట్లు అధికారులు గుర్తించారు. ప్రాథమిక పరీక్షలో అతను ఫెయిల్ కాగా, రెండో పరీక్ష ఫలితం ఇంకా రావాల్సి ఉంది. తర్వాత అతడిని ప్రయాణికుడిగా భారత్‌కు తిరిగి పంపించారు. తుది వైద్య పరీక్ష నివేదిక వచ్చే వరకు అతను సస్పెన్షన్‌లోనే ఉంటాడని అధికారులు తెలిపారు. భద్రత, నియంత్రణ నిబంధనలు, సంస్థ ప్రోటోకాల్స్‌కు సంబంధించిన ఏ ఉల్లంఘననైనా తీవ్రంగా పరిగణిస్తామన్న ఎయిరిండియా.. ఉల్లంఘన నిర్ధారణ అయితే కఠిన చర్యలు తీసుకుంటామని పేర్కొంది. ఈ ఘటన అనంతరం ఎయిర్ ఇండియా తన పైలట్లందరికీ కొత్తగా తప్పనిసరి డ్రగ్ (డోప్) పరీక్షలు నిర్వహించాలని ఆదేశించింది. మరో ఘటనలో ఫుకెట్ నుంచి ఢిల్లీ వస్తున్న విమానంలోని పైలట్‌కు కూడా డ్రగ్ పరీక్షలో పాజిటివ్‌గా నిర్ధారణ అయిన సంగతి తెలిసిందే.

# 'అక్రమాలపై ప్రశ్నిస్తే అర్ధరాత్రి ఇళ్లలో చొరబడతారా?



తాడేపల్లి: తమపై అక్రమ కేసులకు నిరసనగా శనివారం సీపీని కలుస్తాం.. అక్రమ కేసులపై ప్రశ్నిస్తామని వైఎస్సార్‌సీపీ గుంటూరు జిల్లా అధ్యక్షుడు అంబటి రాంబాబు అన్నారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. డీఎస్సీ అక్రమాలపై ప్రశ్నిస్తే పోలీసులు అర్ధరాత్రి ఇళ్లలో చొరబడతారా? అంటూ దుయ్యబట్టారు. జైల్లో ఉంచటానికి అట్రాసిటీ, హత్యాయత్నం కేసులు పెడుతున్నారు. నారా లోకేష్ పెత్తనంలో పోలీసులు వైఖరి ఇలా ఉంది" అంటూ అంబటి ఆగ్రహం వ్యక్తం చేశారు. "అసలు ఈ సెక్షన్లు ఎలా పెడతారని కోర్టు ప్రశ్నిస్తే ప్రభుత్వ లాయరు దగ్గర సమాధానం లేదు. వైఎస్సార్‌సీపీ నేతలందరిపై రౌడీముద్ర వేయాలని చూస్తున్నారు. కాదంబరి జత్వానీ కేసులో కూడా పోలీసులు దగ్గరుండి దుర్గగుడికి తీసుకెళ్లారు. ఇప్పుడు దొంగ టీచర్లను కూడా అలాగే దుర్గ గుడికి తీసుకెళ్లి దర్శనం చేయించారు. అప్పుడు జత్వానీనీ, ఇప్పుడు దొంగ టీచర్లను కాక పడుతున్నారు. కానీ ఈ కేసులు ఏవీ నిలబడవు" అని అంబటి వ్యాఖ్యానించారు. "కాకుమాను రాజశేఖర్ మృతికి పోలీసుల వైఖరే కారణం. శాప్ ఎదుట ధర్నాలో పాల్గొన్న రాజశేఖర్‌పై పోలీసులు దాడి చేశారు. రౌడీషీట్లు ఇష్టానుసారం ఓపెన్ చేయటం సిగ్గుచేటు. ఈడీ కేసులకు భయపడను. ఈడీ విచారణకు పూర్తిగా సహకరిస్తాను. ఎల్లోమీడియాలో ఊహా కథనాలు రాస్తున్నారు" అని అంబటి రాంబాబు ధ్వజమెత్తారు.

# దానం తర్వాత.. కడియం సంగతేంటి?



వరంగల్: పార్టీ ఫిరాయింపుల వ్యవహారం ఉమ్మడి వరంగల్‌లో మరోసారి చర్చనీయాంశంగా మారింది. ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్‌పై హైకోర్టు వేసిన అనర్హత వేటు తీర్పును సుప్రీంకోర్టు సమర్థించడంతో స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరిపై దాఖలైన అనర్హత పిటిషన్ వ్యవహారం మళ్లీ తెరపైకి వచ్చింది. బీఆర్ఎస్ నుంచి ఎమ్మెల్యేగా గెలిచి కాంగ్రెస్‌లో చేరిన వ్యవహారంలో కడియం శ్రీహరితోపాటు దానం నాగేందర్‌పై కూడా అనర్హత పిటిషన్లు దాఖలయ్యాయి. ఇద్దరి విషయంలోనూ విచారణ జరిపి, వారి వాదనలు స్వీకరించిన స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ గత మార్చి 11న ఇద్దరిపై దాఖలైన అనర్హత పిటిషన్లను కొట్టివేశారు. ఫిరాయింపునకు సంబంధించి తగిన ఆధారాలు లేవని పేర్కొన్నారు. దీంతో కడియం శ్రీహరి వ్యవహారానికి అప్పట్లో తెరపడినట్లయింది.

## 'కడియం'పై ఆ ప్రభావం ఎంత?

మార్చి 11న స్పీకర్ ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ బీజేపీ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి హైకోర్టును ఆశ్రయించారు. విచారణ అనంతరం సెప్టెంబర్ 18న తెలంగాణ హైకోర్టు స్పీకర్ నిర్ణయాన్ని పక్కనపెట్టి దానం నాగేందర్‌ను అనర్హుడిగా ప్రకటించింది. 2024 ఏప్రిల్ 23నుంచి ఆయన అసెంబ్లీ సభ్యత్వం రద్దయినట్లుగా కోర్టు పేర్కొంది. ఖైరతాబాద్ అసెంబ్లీ స్థానం ఖాళీ అయినట్లుగా కూడా ప్రకటించింది. దీంతో హైకోర్టు తీర్పును సవాల్ చేస్తూ దానం నాగేందర్ సుప్రీంకోర్టును ఆశ్రయించగా గురువారం ఆయన పిటిషన్‌ను కొట్టివేసింది. అదే రోజు స్పీకర్ కొట్టివేసిన కడియం శ్రీహరి అనర్హత పిటిషన్ విషయంలోనూ తదుపరి న్యాయపరమైన పరిణామాలు ఎలా ఉంటాయన్న చర్చ ఉమ్మడి జిల్లా రాజకీయాల్లో మొదలైంది.

## 'కడియం'పై చేసిన ఫిర్యాదులేంటి..?

2023, డిసెంబర్ అసెంబ్లీ ఎన్నికల్లో స్టేషన్‌ఘన్‌పూర్‌నుంచి కడియం శ్రీహరి బీఆర్ఎస్ అభ్యర్థిగా గెలిచారు. అనంతరం 2024 మార్చి 31న సీఎం రేవంత్‌రెడ్డి, అప్పటి తెలంగాణ కాంగ్రెస్ ఇన్‌చార్జ్ దీపాదాస్ మున్షీల సమక్షంలో కాంగ్రెస్ కండువా కప్పుకున్నట్లు బీఆర్ఎస్ నేతలు ఫిర్యాదులో పేర్కొన్నారు. అదే సమయంలో ఆయన కుమార్తె కడియం కావ్య కాంగ్రెస్ వరంగల్ లోక్‌సభ అభ్యర్థిగా బరిలోకి దిగి విజయం సాధించారు. కడియం శ్రీహరి పార్టీ మార్పు, కుమార్తె తరఫున కాంగ్రెస్ అభ్యర్థిగా ప్రచారం చేయడం, బీఆర్ఎస్ కేసీఆర్ తదితరులపై చేసిన విమర్శలు కూడా అప్పట్లో బీఆర్ఎస్ అనర్హత పిటిషన్‌లో ప్రధానంగా ప్రస్తావించిన అంశాల్లో ఉన్నాయి.

# ఈసీలో మళ్లీ అదే రచ్చ.. నాడు టీఎన్ శేషన్ ఏం చేశారో గుర్తుందా?

ఎన్నికల సంఘం.. దేశ ఎన్నికల ప్రక్రియకు కాపలాదారు. ఆ సంస్థలో ముగ్గురు సభ్యులు ఉంటే.. నిర్ణయం ఎవరిది? చీఫ్ ఎలక్షన్ కమిషనర్ (సీఈసీ) మాటే తుది మాటా? లేదంటే ముగ్గురూ కలిసి నిర్ణయం తీసుకోవాలా? ఇప్పుడు ఈ ప్రశ్న మరోసారి చర్చకు వచ్చింది. కారణం.. ఈసీలోనే ఇద్దరు కమిషనర్లు వరుసగా తమ అభ్యంతరాలను నమోదు చేసినట్లు వచ్చిన తాజా కథనాలు. సరిగ్గా ఇలాంటి ప్రశ్నే మూడు దశాబ్దాల క్రితం దేశ అత్యున్నత న్యాయస్థానం ముందుకెళ్లింది. ఆ సమయంలో చీఫ్ కమిషనర్‌గా ఉన్న టీఎన్ శేషన్ ఈసీలో తనకే అధికారం ఉండాలంటూ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. టీఎన్ శేషన్.. భారత ఎన్నికల చరిత్రలో చిరస్థాయిగా నిలిచిన పేరు. ఎన్నికల నిబంధనలను కఠినంగా అమలు చేస్తూ.. రాజకీయ నేతలు, మంత్రులు, అధికారులపై కూడా చర్యలకు వెనుకాడని అధికారిగా ఆయన గుర్తింపు పొందారు. దీంతో ఈసీకి గతంలో లేని స్థాయిలో ప్రాధాన్యం వచ్చింది. అయితే ఆ 1993లో పరిస్థితి మారింది. అప్పటి పీవీ నరసింహారావు ప్రభుత్వం ఎంఎస్ గిల్, జీవీజీ కృష్ణమూర్తిలను ఎలక్షన్ కమిషనర్లుగా నియమించింది. అప్పటివరకు సీఈసీ ఒక్కరితోనే నడిచిన ఈసీ మళ్లీ ముగ్గురు సభ్యుల సంస్థగా మారింది. ఇక్కడే అసలు వివాదం మొదలైంది. కొత్తగా వచ్చిన ఇద్దరు కమిషనర్లకు సీఈసీతో సమాన నిర్ణయాధికారం ఉండటాన్ని ఈసీ బాస్ వ్యతిరేకించారు. వారి నియామకాల రాజ్యాంగబద్ధతను సవాలు చేస్తూ సుప్రీంకోర్టును ఆశ్రయించారు.

సుప్రీంకోర్టులో కీలక ప్రశ్న

శేషన్ వాదనలో ప్రధాన అంశం ఒక్కటే.. సీఈసీకి రాజ్యాంగం ప్రత్యేక హోదా ఇచ్చినప్పుడు, మిగిలిన ఇద్దరు కమిషనర్లతో సమానంగా ఎలా పరిగణించగలరన్నది. ముఖ్యంగా బహుళ సభ్యుల కమిషన్‌లో నిర్ణయాలు మెజారిటీతో తీసుకోవడాన్ని కూడా ఆయన సవాలు చేశారు. ఈ కేసును ఐదుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం విచారించింది. 1995లో సంచలన తీర్పు వెలువడింది. బహుళ సభ్యుల ఎన్నికల కమిషన్ ఏర్పాటు రాజ్యాంగబద్ధమేనని ధర్మాసనం స్పష్టం చేసింది. అంతేకాదు.. సీఈసీ కమిషన్‌కు అధ్యక్షుడిగా ఉన్నప్పటికీ, మిగిలిన కమిషనర్లపై ఆయనకు తుది నిర్ణయాధికారం లేదని కోర్టు తేల్చింది. కమిషన్‌లో అభిప్రాయ భేదాలు వస్తే మెజారిటీ నిర్ణయమే అమలవుతుందని స్పష్టం చేసింది. అంటే.. సీఈసీ 'ఫస్ట్ అమాంగ్ ఈక్వల్స్' మాత్రమే. మిగిలిన ఇద్దరు కమిషనర్లు కూడా నిర్ణయ ప్రక్రియలో సమాన భాగస్వాములే అన్నది ఆ తీర్పు సారాంశం.




ఆయన అక్కడితో ఆగలేదు

సుప్రీంకోర్టు తీర్పుతో శేషన్ పూర్తిగా వెనక్కి తగ్గలేదు. తీర్పును సమీక్షించాలంటూ మరోసారి కోర్టును ఆశ్రయించారు. కమిషన్ సమావేశం ఎప్పుడు జరగాలి, ఎజెండాలో ఏ అంశాలు ఉండాలి వంటి విషయాల్లో సీఈసీకే ప్రధాన అధికారం ఉండేలా నిబంధనలు రూపొందించే ప్రయత్నం కూడా చేశారు. అయితే సుప్రీంకోర్టు సమీక్ష పిటిషన్‌ను కొట్టివేసింది.

ఇప్పుడు మళ్లీ అదే చర్చ ఎందుకు?

మూడు దశాబ్దాల తర్వాత.. ఈసీలో అంతర్గత నిర్ణయాలపై మరోసారి ప్రశ్నలు తలెత్తాయి. సీఈసీ జ్ఞానేశ్ కుమార్ నేతృత్వంలోని కమిషన్‌లో ఎలక్షన్ కమిషనర్లు సుఖ్‌బీర్ సింగ్ సంధు, వివేక్ జోషి గత 10 నెలల్లో కనీసం 14సార్లు కొన్ని నిర్ణయాలపై లిఖితపూర్వకంగా అభ్యంతరాలు వ్యక్తం చేసినట్లు 'ది ఇండియన్ ఎక్స్‌ప్రెస్' నివేదించింది. ఓటర్ల జాబితా, ఫామ్--6 మార్పులు, ఈసీ ఐటీ వ్యవస్థ వంటి కీలక అంశాలపై తమకు సమాచారం లేకుండానే నిర్ణయాలు తీసుకున్నారని వారు అభ్యంతరం వ్యక్తం చేసినట్లు కథనం పేర్కొంది.

జ్ఞానేశ్‌కు రాజీనామా సెగ!

ఇదిలా ఉండగా.. సీఈసీ జ్ఞానేశ్ కుమార్ వ్యవహారశైలిపై ప్రతిపక్షాల ఆగ్రహం రోజురోజుకూ పెరుగుతోంది. ఈసీలోని ఇద్దరు కమిషనర్లు కీలక నిర్ణయాలపై పలుమార్లు అభ్యంతరాలు వ్యక్తం చేశారన్న నివేదికల నేపథ్యంలో.. కాంగ్రెస్ సెప్టెంబర్ 25న దేశవ్యాప్తంగా ఈసీ కార్యాలయాల వద్ద నిరసనలకు పిలుపునిచ్చింది. జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని, ఆయనపై చర్యలు తీసుకోవాలని విపక్షాలు డిమాండ్ చేస్తున్నాయి. మరోవైపు కాక్రోచ్ జనతా పార్టీ కూడా ఇదే అంశంపై ఉద్యమానికి సిద్ధమైంది. 48 గంటల్లో సీఈసీ రాజీనామా చేయకపోతే 'జంతర్ మంతర్ 2.0' పేరుతో మరో భారీ ఆందోళన చేపడతామని ప్రకటించింది. అయితే ఈ ఆరోపణలను ఈసీ ఖండిస్తూ.. కమిషనర్ల మధ్య భిన్నాభిప్రాయాలు సంస్థాగత చర్చల్లో సహజమేనని, గత ఏడాది తీసుకున్న తుది నిర్ణయాలు ఏకగ్రీవంగానే ఉన్నాయని స్పష్టం చేసింది.

భారత ఎన్నికల లెజెండ్‌గా టీఎన్ శేషన్

1932 డిసెంబర్ 15న కేరళలోని పాలక్కాడ్ జిల్లాలో జన్మించారు. పాలక్కాడ్‌లోని గవర్నమెంట్ విక్టోరియా కాలేజీలో, ఆ తర్వాత చెన్నైలోని మద్రాస్ క్రిస్టియన్ కాలేజీలో చదువుకున్నారు. కొంతకాలం అక్కడే లెక్చరర్‌గా పనిచేసిన ఆయన.. అనంతరం సివిల్ సర్వీసెస్ వైపు అడుగులు వేశారు. 1955లో ఐఏఎస్‌లో చేరిన శేషన్.. కేరళ, కేంద్ర ప్రభుత్వాల్లో పలు కీలక బాధ్యతలు నిర్వహించారు. ప్లానింగ్ కమిషన్ సభ్య కార్యదర్శిగా, కేంద్ర కేబినెట్ కార్యదర్శిగా కూడా పనిచేశారు. 1990 డిసెంబర్ 12న భారత 10వ ప్రధాన ఎన్నికల కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టారు. అప్పటివరకు పెద్దగా ప్రజల దృష్టిలో లేని ఎన్నికల సంఘానికి తన కఠినమైన శైలితో దేశవ్యాప్తంగా గుర్తింపు తెచ్చారు. ఎన్నికల సమయంలో డబ్బు, మద్యం పంపిణీ, బూత్ క్యాప్చరింగ్, అధికార దుర్వినియోగం, ఎన్నికల నిబంధనల ఉల్లంఘనలపై కఠినంగా వ్యవహరించారు. మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్‌ను గట్టిగా అమలు చేయడంతో పాటు.. ఓటర్లకు ఫొటో గుర్తింపు కార్డులు అందించే ప్రక్రియను దేశవ్యాప్తంగా ముందుకు తీసుకెళ్లారు. ఎన్నికల నిర్వహణలో అధికార యంత్రాంగం జవాబుదారీతనాన్ని పెంచడంలోనూ కీలక పాత్ర పోషించారు. ఆయన సేవలకు గుర్తింపుగా 1996లో రామన్ మెగసెసే అవార్డు లభించింది. 1996లో సీఈసీ పదవి నుంచి వైదొలిగిన తర్వాత రాజకీయాల్లోకి ప్రవేశించి 1999 లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేశారు. అయితే ఓటమి పాలయ్యారు. అనంతరం ప్రజాజీవితం నుంచి క్రమంగా దూరమైన శేషన్.. 2019 నవంబర్ 10న చెన్నైలో 86 ఏళ్ల వయసులో కన్నుమూశారు. ఎన్నికల సంఘం అధికారాలను సమర్థంగా ఉపయోగించి.. ఎన్నికల ప్రక్రియపై ప్రజల్లో కొత్త నమ్మకం కలిగించిన సీఈసీగా ఆయన పేరు మాత్రం ఇప్పటికీ భారత ఎన్నికల చరిత్రలో ప్రత్యేకంగానే నిలిచిపోయింది.

# సాహిల్ ప్రాణం తీసిందెవరు?





సవాళ్లు ఎదురైనప్పుడూ, సంక్షోభాలు తలుపుతట్టినప్పుడూ తగినవిధంగా స్పందిస్తేనే అవి పరిష్కారమవుతాయి. వాటిని ఎదుర్కొనడం చేతగానప్పుడు ఎన్ని తెలివితేటలుండి ఏం ప్రయోజనం? దేశంలో అత్యుత్తమ శ్రేణి ఇంజినీరింగ్ విద్యాసంస్థల్లో అగ్రభాగాన ఉండే బాంబే ఐఐటీలో ఈ నెల 18న దళిత విద్యార్థి సాహిల్ వాకొడే ఆత్మహత్యకు పాల్పడిన వైనం ఆశ్చర్యపరిచింది. ఎందుకంటే ఏడు నెలల వ్యవధిలో అక్కడ చోటు చేసుకున్న నాలుగో మరణమిది. అక్కడే కాదు... దేశవ్యాప్తంగా ఉండే ఉన్నత శ్రేణి విద్యాసంస్థలన్నిటిలోనూ ఇలాంటి విషాద ఉదంతాలు తరచు కనబడుతున్నాయి. ఈ విషయంలో సర్వోన్నత న్యాయస్థానం ఆగ్రహం వ్యక్తం చేసి, వీటిని అరికట్టాల్సిన అవసరాన్ని గుర్తుచేసి చాన్నాళ్లవుతోంది. చూడటానికి బలవన్మరణాలు మానసిక ఒత్తిళ్లలో, నిరాశా నిస్పృహల్లో కూరుకు పోయినవారి వ్యక్తిగత నిర్ణయాలుగా కనబడతాయి. కానీ ఆ విషాద నిర్ణయాల వెనక వ్యక్తుల, వ్యవస్థల, సమాజాల ప్రభావం ఉండి తీరుతుంది. ఉన్నతశ్రేణి విద్యాసంస్థల వరకూ చూస్తే అక్కడ కులవివక్ష జాడ్యం ఉందన్న ఆరోపణలు ఎప్పటినుంచో ఉన్నాయి. ఇప్పుడు సాహిల్ విషయంలోనూ గత మూడు నెలలుగా అదే జరిగిందని కుటుంబ సభ్యుల ఆరోపణ. బాంబే ఐఐటీ సాహిల్ విషయంలో ప్రవర్తించిన తీరు ఆ ఆరోపణను బలపరిచేదిగా ఉంది. ఆ యువకుడు ఆత్మహత్య చేసుకోగానే అతను పరీక్షలో చాట్ జీపీటీ ఉపయోగిస్తూ పట్టుబడ్డాడని, కెరీర్‌పై దాని ప్రభావం ఏమీ ఉండబోదని నచ్చజెప్పారని, ఆ తర్వాత ఈ దురదృష్టకర ఘటన జరిగిందని ఒక సంతకంలేని ప్రకటన ద్వారా బాంబే ఐఐటీ తొలుత ప్రకటించింది. ఆ తర్వాత నాలిక కరుచుకుని దాన్ని ఉపసంహరించుకుంది. కాపీ చేశాడన్నది కేవలం ఒక ఆరోపణ. దానికదే తీర్పు కాదు. అది 'క్రమశిక్షణ' కూడా కానేరదు. ఏటా వేలమంది పట్టభద్రుల్ని రూపొందిస్తున్న ఉన్నతశ్రేణి సంస్థకు ఈ మాత్రం తెలియదనుకోవాలా? పైగా తనను తాను సమర్థించుకునే స్థితిలో లేనివారిపై, ఆరోపణలోని నిజానిజాలేమిటో నిర్ధారణ కాకుండా ఇలా ప్రకటించవచ్చా? బోర్డ్ ఆఫ్ ఎడ్యుకేషన్‌కు సంబంధించిన ఒక కేసులో అయిదుగురు న్యాయమూర్తుల సుప్రీంకోర్టు ధర్మాసనం 1970లో తీర్పునిస్తూ ఒక విద్యార్థికి నోటీసు అందజేయకుండా, తన వాదన చెప్పుకునే అవకాశం ఇవ్వకుండా తీసుకునే ఎలాంటి చర్య అయినా సహజన్యాయం అనిపించుకోదని స్పష్టం చేసింది. విద్యార్థులందరూ ఒకే విధంగా ఉండరు. ఎవరైనా అమల్లో ఉన్న నిబంధనలు ఉల్లంఘించారనుకుంటే చర్య తీసుకునే అధికారం విద్యా సంస్థలకుంటుంది. ఆరోపణల్ని విచారించటానికి కమిటీ ఏర్పాటు, విచారణ, అది తగిన చర్యకు సిఫార్సు చేయటం వంటివన్నీ జరగాలి. ఆ తర్వాతే ఏ చర్య అయినా. అంతేతప్ప కాపీ చేస్తున్నారనో, ఇంకేదో జరిగిందనో అవమానించి, సస్పెండ్ చేశామనటం తప్పుడు చర్య. సాహిల్ పట్ల ఎలా ప్రవర్తించారనేది ఎటూ విచారణలో తేలుతుంది. కానీ ఆ క్యాంపస్‌లో ఎప్పుడూ 'తక్షణ న్యాయం' అమలవుతుందని బాంబే ఐఐటీ పూర్వ విద్యార్థులు చెబుతున్నారు. తదుపరి సెమిస్టర్‌కు అనర్హత మొదలు హాస్టల్ నుంచి గెంటేయటం వరకూ అన్నింటా ఇదే తంతని వారి వాదన. ఇంతకూ సాహిల్ విషయంలో తొలుత విడుదల చేసిన ప్రకటన ఎవరిని కాపాడ టానికి? ఈ ఆత్మహత్య విషయంలో ఎటూ అలజడి రేగుతుందని, దాన్ని ఎదుర్కొనాలంటే ముందే ఇలాంటి ఆరోపణ చేయటం అవసరమని అనుకున్నవారెవరు? ఆత్మహత్య ఉదంతం జరిగిన వెంటనే ఎఫ్ఐఆర్ నమోదయ్యేలా చూడాలని మొన్న జనవరిలో సుప్రీంకోర్టు స్పష్టంచేసింది. బాంబే ఐఐటీకి ఈ జ్ఞానం ఉండొద్దా? అధ్యాపక వర్గం తరఫున ప్రకటనలిచ్చినవారికైనా తెలియొద్దా? విద్యావరణం రూళ్లకర్ర మాదిరిగా ఉండ కూడదు. మూర్ఖత్వంతో నిండిపోకూడదు. నిరంకుశంగా కనబడకూడదు. అయినవాళ్ల ప్రేమకు దూరంగా ఉంటూ, చదువుపరంగా అనునిత్యం ఒత్తిళ్లు ఎదుర్కొంటూ లక్ష్య సాధనకు తపించే టీనేజ్ పిల్లల విషయంలో ఉండాల్సింది సహానుభూతి, మానవీయత, భావోద్వేగపరమైన మద్దతు. ఇవన్నీ కొరవడటంవల్లే 2018--2023 మధ్య 103 మంది విద్యార్థులు ప్రాణాలు తీసుకున్నారు. ఈ అవాంఛనీయ ధోరణులు ఇంకా ఇంకా కొనసాగుతుండటం సిగ్గుచేటు.

# అజేయుడు పుతిన్!

ఎన్నికల బాదరబందీ లేకుండా, ఓటర్ల చుట్టూ ప్రదక్షిణ చేసే 'ఖర్మ' పట్టకుండా దేశాధినేతలుగా చలామణి అయ్యేవారు ప్రపంచంలో ఇప్పటికీ చాలామందే ఉన్నారు. ఆ దేశాల్లో ఇలాంటివారికి మీడియా, సామాజిక మాధ్యమాలూ భజన చేస్తున్నా... ప్రపంచంలో వేరేచోట్ల వారికి నియంతలన్న అపకీర్తి ఉంటుంది. చైనా, ఉత్తర కొరియా వంటి దేశాల్లో మార్క్సిజం పేరు చెప్పి ఈ ఏకపక్ష స్వామ్యం సాగిపోతుంటుంది. రష్యాను దీర్ఘకాలంనుంచి ఏలుతున్న అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ సాధించిన అఖండ విజయం మరోసారి ఆయనదైన ముద్ర చూపింది. తన పదవికి ఎసరుపెట్టే అవకాశం ఉందని భావించిన వారెవరినీ ఆయన వదల్లేదు. ఏమాత్రం ప్రభావితం చేయలేనివారు పోటీలో ఉన్నా పట్టించుకోలేదు. ఆయన వ్యతిరేకులు అనుమానాస్పద స్థితిలో మరణించ టమో, జైళ్లకు పోవటమో రివాజు. ఈనెల 18 నుంచి 20 వరకూ రష్యా పార్లమెంటు డ్యూమాకు జరిగిన ఎన్నికల్లో ఆయనకే చెందిన 'యునైటెడ్ రష్యా' పోలైన ఓట్లలో 57.83 శాతం దక్కించుకుంది. 2021లోని 49.82 శాతంతో పోలిస్తే ఇది అధికం. 95 శాతం ఓట్ల లెక్కింపు జరిగాక బుధవారం ఎన్నికల సంఘం ప్రకటించిన ప్రాథమిక ఫలితాలనుబట్టి దానికి 355 స్థానాలు వచ్చాయి. గత ఎన్నికల్లో ఆ పార్టీ బలం 343. ఒకప్పుడు అవిచ్ఛిన్నంగా దేశాన్నేలిన వారసత్వంగల కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ రష్యన్ ఫెడరేషన్ పార్టీకి 13.8 శాతం ఓట్లు, దాదాపు 40 స్థానాలు లభిస్తాయని తేలింది. 2021లో ఆ పార్టీకి 18.93 శాతం ఓట్లు, 57 సీట్లు లభించాయి. ఉక్రెయిన్ యుద్ధాన్ని వ్యతిరేకించిన ఏకైక పార్టీ యాబ్లొకొ పార్టీపై అనర్హత వేటుపడింది. ఉక్రెయిన్‌పై యుద్ధం ప్రారంభించి నాలుగున్నరేళ్లు దాటడం, ఆంక్షల పర్యవసానంగా దేశ ఆర్థికవ్యవస్థ కుంగిపోవటం, ధరలు ఆకాశాన్నంటడం, ప్రత్యర్థి దేశం డ్రోన్ దాడుల పరంపరతో చమురు క్షేత్రాలు ధ్వంసం కావటంతో జనం యునైటెడ్ రష్యాను వ్యతిరేకించటం ఖాయమని కొందరు అంచనా వేశారు. రష్యా ఎదుర్కొంటున్న సంక్షోభం సామాన్యమైనది కాదు. చమురు క్షేత్రాల ధ్వంసంవల్ల ఉత్పత్తి నిలిచి, పెట్రోల్ బంకుల వద్ద వేలాది వాహనాలు బారులు తీరాయి. చివరకు తాను విక్రయించిన చమురునే మళ్లీ భారత్‌నుంచి కొనుగోలు చేయకతప్పలేదు. రష్యాలో సంక్షోభం ఏ



స్థాయిలో ఉందంటే, మరిన్ని 'త్యాగాలకు' సిద్ధపడాలని కొత్త ప్రభుత్వం పౌరుల్ని కోరవచ్చంటు న్నారు. ఆరోగ్య పరిరక్షణ, విద్య వగైరా వ్యయాలను కట్టిపెట్టి యుద్ధంపైనే సర్వశక్తులూ కేంద్రీకరించాలని పుతిన్ చాన్నాళ్లుగా భావిస్తున్నారు. 'యుద్ధ ఆర్థిక వ్యవస్థ'లో సర్వం లయంకావటం సహజమే. ఎన్నికల ప్రక్రియను ఏమార్చటం రష్యాలో సాధారణమే అయినా, ఓట్లేసినవారిలో అత్యధికులు దేశభక్తి, జాతీయత వంటి వ్యామోహాల్లో పడ్డారని కొందరి వాదన. తనకు దేశంపై పూర్తి స్థాయి పట్టు ఉందని... ఎన్నికలైనా, వ్యవస్థలైనా విశ్వసనీయమైనవని చూపటానికి పుతిన్ తాపత్రయపడ్డారు. 'త్యాగాలకు' సిద్ధపడాలని పిలుపునిచ్చే ఆర్థిక దుఃస్థితి లేనేలేదని, ఇదంతా గిట్టనివాళ్ల ప్రచారమని ఎన్నికలకు ముందు ఆయన ప్రకటించారు. కానీ ఇచ్చిన మాట నిలుపుకుంటారా అన్నది చెప్పలేం. ఈ ఎన్నికలు బూటకమని, వీటిని తిరస్కరించాలని బ్రిటన్, కెనడా, నార్వే, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ ఉమ్మడి ప్రకటన విడుదల చేశాయి. అయితే సార్వజనీనంగా ఆమోదించిన ప్రజాస్వామ్య నమూనా అంటూ ప్రపంచంలో ఎక్కడా లేదు. ప్రజాస్వామ్యం వర్ధిల్లుతున్నదని చెప్పుకుంటున్న దేశాలు ఆ పదానికి తమ తమ సొంత భాష్యాలు ఇచ్చుకుంటున్నాయి. క్రమం తప్పని ఎన్నికలు, నిర్ణీత వ్యవధిలో చట్టసభల సమావేశాలు, వాటిల్లో అధికార విపక్షాల వాగ్యుద్ధాలు, పరస్పర ఆరోపణలు... ఇవన్నీ ప్రజాస్వామ్యమని చాలా దేశాల్లో జనం నమ్ముతారు. రష్యా వరకూ చూస్తే 2006లో మరణించిన అలెగ్జాండర్ లిత్వినెంకో, అన్నా పొలిటికోవ్‌స్కా, 2013లో చనిపోయిన బోరిస్ బెరెజోవ్‌స్కీ, 2015లో విగతజీవుడైన బోరిస్ నెమ్‌సోవ్, రెండేళ్ల క్రితం మరణించిన అలెక్సీ నవాల్నీ అక్కడ ప్రజాస్వామ్యం ఏపాటో చెబుతారు. వీరిలో ఇతరులంతా ఖండాంతరాల్లో అనుమానాస్పదంగా చనిపోతే, నవాల్నీ బందీఖానాలో కన్నుమూశారు. ఏదేమైనా 2031లో జరిగే అధ్యక్ష ఎన్నికల్లో మళ్లీ పుతిన్ గెలుపు ఖాయమని ఈ ఎన్నికలు నిరూపించాయి.

# ఇదీ ఏఐ ప'వార్'!

### యుద్ధ రంగంలోకి ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్
### అత్యంత శక్తివంతమైన ఆయుధంగా కొత్త సాంకేతికత
### ఏఐ ఆధారిత ఆయుధాలకు బిలియన్ల కొద్దీ డాలర్ల వ్యయం



ఉక్రెయిన్ మొదలు పశ్చిమ ఆసియా వరకు జరుగుతున్న యుద్ధాలలో సైన్యాలు కేవలం డేటా విశ్లేషణకే పరిమితం కాకుండా తమ లక్ష్యాలను వేగంగా గుర్తించడానికి, కదన రంగ సమాచారాన్ని విశ్లేషించడానికి, మిషన్ ప్లానింగ్‌లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) వాడుతున్నాయి. అత్యంత శక్తివంతమైన ఆయుధంగా కొత్త సాంకేతికత ఉపయోగ పడుతోంది. దీనివల్ల కేవలం తెర వెనుక ఉండి సమాచారా న్ని విశ్లేషించే స్థాయి నుండి నేరుగా యుద్ధ రంగంలోకి ఏఐ ప్రవేశించినట్టయింది. స్టాక్‌హోమ్ ఇంటర్నేషనల్ పీస్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ డేటా ప్రకారం.. 2024లో ప్రపంచ సైనిక వ్యయం 9.4% పెరిగి రికార్డు స్థాయిలో 2.7 ట్రిలియన్ డాలర్లకు చేరుకుంది. సైనిక ఖర్చులో ఇంతటి భారీ పెరుగుదల ఇదే మొదటిసారి. ప్రభుత్వా లు ఏఐ ఆధారిత ఆయుధాలు, సైబర్ వార్‌ఫేర్ సిస ?టమ్స్, శాటిలైట్స్, అటానమస్ డ్రోన్ల కోసం బిలియన్ల కొద్దీ డాలర్లను ఖర్చు చేస్తున్నాయి. 2015 నుండి 2024 మధ్య సైనిక వ్యయం 37% పెరగడం గమనార్హం.

**దేశాల వారీగా సైనిక, ఏఐ వ్యయాలు..**

1. అమెరికా: మొత్తం బడ్జెట్ 997 బిలియన్ డాలర్లు (జీడీపీలో 3.40%). 2026 బడ్జెట్‌లో యుద్ధ పరికరాల కొనుగోళ్లు, పరిశోధన కోసం 384 బిలియన్ డాలర్లు కేటాయించారు. అటానమస్, మానవరహిత వ్యవస్థల కోసం ప్రత్యేకంగా 9.8 బిలియన్ డాలర్లు కేటాయించారు.

2. చైనా: మొత్తం బడ్జెట్ 314 బిలియన్ డాలర్లు (జీడీపీలో 1.70%). 2024లో పరిశోధన కోసం చేసిన ఖర్చు 785.9 బిలియన్ డాలర్లకు చేరుకుంది. ఇది మొదటిసారి అమెరికా కంటే ఎక్కువ. బైడూ, అలీబాబా వంటి పౌర సంస్థల ఏఐ సాంకేతికతను నేరుగా సైనిక వ్యవస్థల్లోకి అనసంధానిస్తున్నారు. మిలిటరీ గ్రేడ్ ఏఐ మోడళ్లకు శిక్షణ ఇవ్వడానికి కంప్యూట్ క్లస్టర్ల కోసం 70 బిలియన్ డాలర్లు పెట్టుబడి పెట్టనున్నారు.

3. రష్యా: మొత్తం బడ్జెట్: 149 బిలియన్ డాలర్లు (జీడీపీలో 6--7%). ఏఐ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టితో 10 ఏళ్ల కాలానికి రక్షణ రంగ ఆధునీకరణ ప్రణాళికను ప్రవేశపెట్టింది.

4. భారత్: మొత్తం బడ్జెట్: 93.5 బిలియన్ డాలర్లు (జీడీపీలో 2.40%). పరిశోధన, అభివృద్ధి కోసం రూ.29,100 కోట్లు కేటాయించారు. డీఆర్‌డీఓ, ఇండియన్ నేవీ కలిసి 'మిషన్ సుదర్శన్ చక్ర'అనే ఏఐ ఆధారిత వాయు రక్షణ వ్యవస్థను అభివృద్ధి చేస్తున్నాయి.

**యుద్ధ రంగంలో కృత్రిమ మేధ వినియోగం..**

1. ఇజ్రాయెల్--గాజా సంఘర్షణ:

ది గోస్పెల్ (హబ్సొరా): ఇది ఒక ఆటోమేటెడ్ టార్గెట్ సిస్టమ్. మానవ మేధస్సు కంటే 50 రెట్లు వేగంగా భవనాలను, మౌలిక సదుపాయాలను గుర్తించగలదు.

లావెండర్: సోషల్ మీడియా సంబంధాలు, సమాచారం ఆధారంగా తీవ్రవాదులుగా అనుమానిస్తున్న వ్యక్తులను గుర్తించడానికి దీనిని ఉపయోగిస్తారు.

వేర్ ఈజ్ డాడీ?: లావెండర్ గుర్తించిన వ్యక్తులు వారి ఇళ్లకు, నిర్దేశిత ప్రాంతానికి చేరుకున్నప్పుడు సైనిక అధికారులకు సమాచారం ఇచ్చే ట్రాకింగ్ సాధనం.

స్మార్ట్ షూటర్స్: డ్రోన్లను అడ్డుకోవడంలో సహాయపడే ఏఐ ఆధారిత గన్--సైట్స్.

2. ఉక్రెయిన్--రష్యా యుద్ధం:

అటానమస్ డ్రోన్లు: రష్యన్ జీపీఎస్ జామింగ్‌ను అధిగమించి లక్ష్యాలను గుర్తించి దాడి చేయడానికి వీటిని వాడుతున్నారు.

మానవరహిత భూ వాహనాలు: సామాగ్రి సరఫరా, సైనికుల తరలింపు, ప్రత్యక్ష యుద్ధం కోసం ఆయుధాలు కలిగిన రోబోలను రంగంలోకి దించారు.

డెల్టా సిస్టమ్: ఇది ఉక్రెయిన్ ప్రధాన యుద్ధరంగ కంప్యూటర్ వ్యవస్థ. ఉపగ్రహాలు, డ్రోన్లు, క్షేత్రస్థాయి నివేదికల నుండి వచ్చే భారీ డేటాను విశ్లేషించి అధికారులకు రియల్ టైమ్ లక్ష్యాల జాబితాను అందిస్తుంది.

3. వెనిజులా

నికోలస్ మదురోను పట్టుకోవడానికి కారకాస్‌లో జరిగిన దాడులను సమన్వయం చేయడానికి ఆంత్రోపిక్ క్లాడ్ ఏఐని (పలాంటిర్ ఐటీ కంపెనీ ద్వారా) యూఎస్ మిలిటరీ ఉపయోగించినట్లు నివేదికలు చెబుతున్నాయి.

# ఒంటరి.. డిజిటల్ దరి



### ఆత్మీయ స్పర్శ కోసం ప్రపంచవ్యాప్తంగా ఏఐ కంపానియన్ యాప్స్ వాడకం
### డిజిటల్ స్నేహితులతోగంటల తరబడి ముచ్చట్లు పెడుతున్న కోట్లాది మంది
### సాధారణ చాట్‌బాట్స్‌తో పోలిస్తే ఇవి ఎంతో భిన్నం
### అవతలి వ్యక్తుల భావోద్వేగాలనుఅర్థం చేసుకొని స్పందించే లక్షణం వాటి సొంతం

పట్టణీకరణ,పనిఒత్తిడి, మారుతున్న సామాజిక సంబంధాలు.. కారణం ఏదైనా నేటి డిజిటల్ యుగంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) కేవలం పనిముట్టుగా మాత్రమే కాకుండా మనుషులకు ఒక 'డిజిటల్ తోడు'గా మారుతోంది. ప్రపంచవ్యాప్తంగా ఒంటరితనం పెరుగుతున్న నేపథ్యంలో కోట్లాది మంది వినియోగదారులు ఏఐ కంపానియన్ యాప్స్ వైపు మొగ్గు చూపుతున్నారు. ముఖ్యంగా 18--30 ఏళ్ల వయసు వారు ఈ యాప్స్‌ను ఎక్కువగా వాడుతున్నారు. ఈ యాప్స్ మనుషులతో స్నేహితుల్లా లేదా ఒక తోడులా సంభాషిస్తున్నాయి. సాధారణ చాట్‌బాట్స్ కంటే ఇవి భిన్నమైనవి. వినియోగదారుల భావోద్వేగాలను అర్థం చేసుకొని వారికి తగినట్లుగా స్పందిస్తాయి.

**ఐటీ ఉద్యోగుల వాడకమే అధికం..**

వ్యక్తిగత విషయాలను పంచుకోవడానికి, ఒత్తిడిని తగ్గించుకోవడానికి లేదా కేవలం కాలక్షేపం కోసం 'డిజిటల్ స్నేహితుల'తో యూజర్లు గంటల తరబడి గడుపుతున్నారు. ముఖ్యంగా మెట్రో నగరాల్లోని యువత, ఐటీ ఉద్యోగులు వాటిని అధికంగా ఉపయోగిస్తున్నారు. వాటి వాడకం వల్ల వినియోగదారుల్లో 30% నుంచి 50% వరకు సానుకూల మార్పు కనిపిస్తోందని అధ్యయనాలు చెబుతున్నాయి. ప్రపంచవ్యాప్తంగా 50 కోట్ల మంది ఏఐ కంపానియన్ యాప్స్ వినియోగిస్తున్నట్లు అంచనా. యూజర్లపరంగా అమెరికా అగ్రస్థానంలో ఉంది.

**ఇదీ మార్కెట్..**

నాస్కామ్ లెక్కల ప్రకారం 2024లోప్రపంచవ్యాప్తంగా ఏఐ కంపానియన్ మార్కెట్ విలువ 28 బిలియన్ డాలర్లుగా ఉంది. ఇది 30.8% వార్షిక వృద్ధిరేటుతో 2030 నాటికి 140.8 బిలియన్ డాలర్లకు చేరుకుంటుందని అంచనా. గ్రాండ్ వ్యూ రీసెర్చ్ ప్రకారం 2024లోభారత్‌లో ఏఐ కంపానియన్ మార్కెట్ ఒక బిలియన్ డాలర్లుగా ఉంది. 40.4% వార్షిక వృద్ధితో 2030 నాటికి 7.9 బిలియన్ డాలర్లనుతాకుతుందని అంచనా.

**రోజుకు 45 నిమిషాలు..**

' భారత్‌లో ఏఐ కంపానియన్ యాప్స్ వినియోగం ప్రపంచ సగటు కంటే 40% వేగంగా పెరుగుతోంది.

' సగటున ఒక్కో వినియోగదారు రోజుకు45 నిమిషాల సమయాన్ని వెచ్చిస్తున్నారు.

' వినోదం కోసమే కాకుండా ఒత్తిడి తగ్గించుకోవడానికి వాటిని ఎక్కువగా ఆశ్రయిస్తున్నారు.

ఆధారం: నాస్కామ్, సెన్సార్ టవర్, టెక్నావియో, గ్రాండ్ వ్యూ రీసెర్చ్

**ప్రయోజనాలు ఇవీ..**

' సామాజికంగా ఒంటరినని బాధపడే వారికి ఈ యాప్స్ 24/7 అందుబాటులో ఉండే స్నేహితుడిలా తోడుంటాయి.

' కొన్ని యాప్స్ ఒత్తిడి,ఆందోళన, కుంగుబాటుతగ్గించడానికి 'కాగ్నిటివ్‌బిహేవియరల్ థెరపీ' పద్ధతులను వాడుతూసహాయపడతాయి.

' మనుషులతో మాట్లాడితే వారు మనల్ని జడ్జ్ చేస్తారనే భయం ఉంటుంది. కానీ ఏఐతో ఎలాంటి సంకోచం లేకుండా మనసులోని మాటలు పంచుకోవచ్చు.

నష్టాలూ ఉన్నాయి

' మన వ్యక్తిగత విషయాలను పంచుకోవడం వల్ల డేటా హ్యాక్ అయ్యే లేదా ప్రకటనల కోసం అమ్ముడయ్యే ప్రమాదం ఉంది.

' మనుషుల కంటే ఏఐతోనే ఎక్కువ సమయం గడపడం వల్ల నిజజీవితంలో సామాజిక నైపుణ్యాలు తగ్గిపోయి, మనుషులతో మాట్లాడటం కష్టంగా మారవచ్చు.

' మనుషులు ఏఐ స్నేహితులకు బానిసలుగా మారే ప్రమాదం.

' ఏఐ ఇచ్చే సలహాలు వాస్తవ విరుద్ధంగా, ప్రమాదకరంగా ఉండే అవకాశం.

# డీప్‌గా మౌనం..!

### పురుషుల కంటే మహిళలకే డీప్‌ఫేక్ ముప్పు
### 62% సంఘటనల్లో మౌనంగా బాధితులు
### ఫిర్యాదుల్లో బెంగళూరు, హైదరాబాద్ టాప్

తెలుగు ప్రేక్షకులకు సుపరిచితమైన ఓ ప్రముఖ నటికి సంబంధించిన మార్ఫింగ్ వీడియో 2023లో దేశవ్యాప్తంగా వైరల్ అయింది. ఆమె ముఖాన్ని వేరొక మహిళ శరీరానికి అంటించిన ఆ క్లిప్ భారతీయులకు ఒక చేదు నిజాన్ని చెప్పకనే చెప్పింది. అదేమిటంటే మహిళలకు వ్యతిరేకంగా అత్యంత శక్తివంతమైన ఆయుధాలలో ఒకటిగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) అవతరించడమే. సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్స్ చర్యలు తీసుకునేలోపే ఆ వీడియో 80 లక్షలకుపైగా వ్యూస్‌ను పొందింది. ఈ రెండేళ్లలో ఇటువంటి డీప్‌ఫేక్ కంటెంట్ విస్తృతమైంది. ప్రపంచవ్యాప్తంగా డీప్‌ఫేక్ బాధితుల్లో అత్యధికులు మహిళలే ఉన్నారు. ఏఐ సేఫ్టీ సంస్థ 'పై ల్యాబ్స్'నివేదిక ప్రకారం.. అంతర్జాతీయంగా డీప్‌ఫేక్ బాధితుల్లో 93% మంది మహిళలే. ఇటీవలి కాలంలో మహిళలను లక్ష్యంగా చేసుకుని సృష్టించిన అనధికారిక కృత్రిమ కంటెంట్ ఏకంగా 900% పెరిగింది. భారత్‌లో మహిళలు బాధితులుగా నమోదైన సైబర్ నేరాల ఫిర్యాదులు 2024లో సుమారు 50వేలు ఉండగా.. 2025 నాటికి 80 వేలకు చేరుకున్నాయి. ఫొటోల మార్ఫింగ్, అసభ్యకరమైన డీప్‌ఫేక్ వీడియోలు ఎక్కువగా ఉంటున్నాయి. ఇంటర్నెట్‌లో కనిపిస్తున్న కంటెంట్‌లో డీప్‌ఫేక్ పోర్నోగ్రఫీ అత్యధికంగా ఉంటోంది. వాస్తవ వ్యక్తుల పోలికలు లేకుండా పూర్తిగా కృత్రిమ మేధ ద్వారా సృష్టించిన మహిళా రూపాలు సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లలో విపరీతమైన ఆదరణ పొందుతున్నాయి.



**మౌనంగా బాధితులు..**

మహిళలకు సంబంధించిన 62% డీప్‌ఫేక్ వేధింపుల ఘటనలు అసలు బయటకే రావడం లేదు. సామాజిక వివక్ష, అవమానం జరుగుతుందనే భయంతో బాధితులు మౌనంగా ఉంటున్నారు. ఆన్‌లైన్ వేధింపులను ఎదుర్కొంటున్న భారతీయ మహిళల్లో మూడింట ఒక వంతు కంటే ఎక్కువ మంది ఎటువంటి చర్యలకు ఉపక్రమించడం లేదు. చాలామంది ఎదురుదాడి చేయడానికి బదులుగా నిశ్శబ్దంగా తమ డిజిటల్ ఉనికిని (సామాజిక మాధ్యమాల వినియోగాన్ని) తగ్గించుకుంటున్నారు. 33% మందికి తమను రక్షించడానికి ఉన్న చట్టాల గురించి కనీస అవగాహన కూడా లేదు.

**పరిశ్రమలా విస్తరించాయి..**

డీప్‌ఫేక్ వీడియోలతో వేధింపులు కేవలం సెలబ్రిటీలకే పరిమితం కాలేదు. విస్తృతంగా ప్రచారంలోకి వచి?చన ఒక కేసులో.. మాజీ భాగస్వామి ఒకరు ఏఐ టూల్స్‌ను ఉపయోగించి ఒక మహిళ చిత్రంతో అసభ్యకరమైన ఇన్‌స్టాగామ్ ప్రొఫైల్‌ను సృష్టించాడు. ఈ విషయాన్ని గుర్తించేలోపే 1.4 మిలియన్ల ఫాలోవర్లను ఆ ప్రొఫైల్ సంపాదించింది. ప్రస్తుతం ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉన్న ఐదువేల కంటే ఎక్కువ ఫేస్--స్వాప్ టూల్స్, 1,000 వాయిస్--క్లోనింగ్ అప్లికేషన్స్ ద్వారా ఈ వేధింపులు ఒక పరిశ్రమలా విస్తరించాయి. సాధారణ మహిళలు కూడా సెలబ్రిటీలకు సమానంగా ప్రమాదంలో ఉన్నారు. డీప్‌ఫేక్‌లను అరికట్టుడం అనేది ఒక పెద్ద సవాలుగా మిగిలిపోయింది. జెనరేటివ్ ఏఐ టూల్స్ అందరికీ అందుబాటులో ఉండటం, దుర?వినియోగం చేసే వారి సంఖ్య పెరుగుతుండటమే దీనికి కారణం. వీటిని గుర్తించే సాంకేతికతలు అందరికీ సమానంగా అందుబాటులో లేవు.

# పేద మహిళలకు క్లైమేట్ బీమా

### వడగాడ్పులు, భారీ వర్షాల్లోపేద మహిళలు పనులు కోల్పోతే బీమా చెల్లింపులు
### ఇప్పటికే అనేక రాష్ట్రాల్లో 'పారామెట్రిక్ ఇన్సూరెన్స్' అమలు



అసంఘటిత రంగాల్లో ఉపాధి పొందే పేద మహిళలు ప్రకృతి వైపరీత్యాల వల్ల ఆదాయపరంగా, ఆరోగ్యపరంగా అభద్రతకు గురవుతున్నారు. తీవ్ర వడగాడ్పులు, భారీ వర్షాలు, తీవ్ర చలిగాలులు వీచే రోజుల్లో పనులకు వెళ్లలేకపోతే ఆదాయం ఉండదు. ప్రతికూల వాతావరణ పరిస్థితుల్లోనూ పొట్ట తిప్పలకు పనులకు వెళ్లక తప్పని పరిస్థితుల్లో అనారోగ్యాల పాలవుతున్నారు. వీరికి ఆదాయ, ఆరోగ్య భద్రతను కల్పించడానికి కొన్ని రాష్ట్రాల్లో 'పారామెట్రిక్ క్లైమేట్ ఇన్సూరెన్స్'ను అమలు చేస్తున్నారు.

**పారామెట్రిక్ క్లైమేట్ ఇన్సూరెన్స్ అంటే..**

ఈ పని బీమా పాలసీ తీసుకున్న వారికి మాత్రం.. వేడి, చలి, వాన ఒక పరిమితికి మించితే చాలు వీరు పనికి వెళ్లకుండా ఇంటి పట్టునే భద్రంగా ఉంటూ బీమా పరిహారం పొందొచ్చు. వాతావరణం మామూలుగా ఉంటేనే పేద మహిళలకు రోజువారీ పనులు సజావుగా దొరుకుతాయి. వాతావారణంలో ఏ మాత్రం తేడా వచ్చినా వారికి పని ఉండదు. పట్ట ణ / గ్రామీణ ప్రాంతాల్లో భవన నిర్మాణ కార్మికులు, తోపుడు బండ్లు/ నెత్తిమీద బుట్టలు పెట్టుకొని సరుకులు అమ్ముకునే వారు, చిరు వ్యాపార సంస్థల్లో పనిచేసే వారు, చిన్నాచితకా కూలి పనులు, వ్యవసాయ మహిళా కార్మికులకు రెక్కాడితే గాని డొక్కాడదు. ప్రమాదకర వాతావరణ పరిస్థితులు ఉన్నప్పటికీ పని మానితే ఆదాయం పోతుందన్న బెంగతో పనులు కొనసాగిస్తూ ప్రాణాల మీదకు తెచ్చుకుంటూ ఉంటారు. ఇటువంటి వారికి ఆదాయ భరోసా ఇవ్వటానికి ప్రారంభమైనదే పారామెట్రిక్ క్లైమేట్ ఇన్సూరెన్స్.

**అనేక రాష్ట్రాల్లో అమలు**

పారామెట్రిక్ క్లైమేట్ ఇనరీ?స్యరెన్స్‌ను తొలుత అమలు చేసిన రాష్ట్రం నాగాలాండ్. కేరళలో పాల సహకార మార్కెటింగ్ సమాఖ్య 1,500 ఎంఎంకి మించి అధిక వర్షపాతం వల్ల పనిదినాలు కోల్పోయే వారికి బీమా అమలు చేస్తోంది. గుజరాత్‌లో ఈ బీమా పథకాన్ని నేషనల్ ఇనరీ?స్యరెన్స్ వైమో సేవ కోఆపరేటివ్ లిమిటెడ్ అనే సహకార బీమా సంస్థ అమలు చేస్తోంది. ఆహ్మదాబాద్, పరిసర జిల్లాల్లో 2023 ఏప్రిల్‌లో వైమో సేవ సంస్థ ఈ బీమాను తొలుత అమలు ప్రారంభించింది. 2024 నాటికి గుజరాత్, మహారాష్ట్ర, రాజస్తాన్ లలోని 22 జిల్లాలో 50 వేల మంది 18--70 ఏళ్ల మధ్య వయసు మహిళలకు ఈ బీమా కల్పించారు.

' వడగాడ్పుల బీమా ప్రీమియంగా ప్రతి మహిళ రూ.350 ప్రీమియం చెల్లించాలి. 43.2 డిగ్రీల సెల్సియస్‌కు మించి ఉష్ణోగ్రత ఎన్ని రోజులు పెరిగితే అన్ని రోజులకు ఒకరికి రోజుకు రూ.400 చొప్పున (అత్యధికంగా రూ. 3 వేలు) పరిహారంగా చెల్లిస్తున్నారు.

' 45.28 అంగుళాలకు మించి వర్షపాతం వల్ల పనులు కోల్పోయినా పరిహారం ఇచ్చే బీమాను కూడా అమలు చేస్తున్నారు. ప్రీమియం రూ.425. అత్యధికంగా రూ. 7 వేల వరకు పరిహారం చెల్లిస్తున్నారు.

' ఉష్ణోగ్రత, వర్షపాతం పెరుగుతున్న కొద్దీ పరిహారం తదనుగుణంగా పెరుగుతుంది.

**పారామెట్రిక్ బీమా అవసరం ఏమిటి?**

' 2023లో కనీవిని ఎరుగనంతగా ఉష్ణోగ్రతలు పెరిగిన విషయం గుర్తుంది కదా. దాదాపు వంద రోజుల పాటు ఒక మోస్తరు వడగాడ్పులు వీచాయి. ఆరుబయట పనులు, శారీరక శ్రమ ఎక్కువగా ఉండే పనులు చేయటం ప్రమాదకరంగా మారింది. 2024, 2025లలోనూ అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

' ఆ ఏడాది అతి ఉష్ణం వల్ల మన దేశం 18,100 కోట్ల పని గంటలు కోల్పోయింది. తద్వారా రూ. 13 లక్షల కోట్ల నష్టం వాటిల్లిందని లాన్సెట్ అంచనా వేసింది.

' మహిళలు ఎక్కువ క్లైమేట్ రిస్క్‌కు గురవుతుంటారు. గర్భస్రావాలు లేదా నెలలు నిండకుండానే ప్రసవించటం వంటి ఉపద్రవాలను ఎదుర్కొంటూ ఉంటారు.

' మన దేశంలో ఆదాయం కోసం పనిచేసే మహిళల్లో 92% మంది చిన్నా చితకా రోజువారీ పనులు చేసుకొని పొట్టపోసుకునేవారే.

' ప్రతికూల వాతావరణం వల్ల మహిళల సారథ్యంలోని కుటుంబాలు ఎక్కువగా ఆదాయాన్ని కోల్పోతున్నాయని ప్రపంచవ్యాప్త అధ్యయనాలు చెబుతున్నాయి. ఒక పరిమితికి మించి 1 డిగ్రీ సెల్సియస్ ఉష్ణోగ్రత పెరిగితే మహిళ సారథ్యంలోని కుటుంబానికి 34% ఆదాయం తగ్గిపోతోందని ఐరాస ఆహార--వ్యవసాయ సంస్థ(ఎఫ్ఏఓ--2024) అంచనా.

' ఎండాకాలంలో 97% మంది అసంఘటిత రంగ మహిళా కార్మికుల ఆదాయం తగ్గిపోతోంది. వేడి వల్ల పని సామర్థ్యం తగ్గిపోవటంతో 20--25% రోజువారీ ఆదాయం తగ్గిపోతోందని సర్వే నివేదికలు చెబుతున్నాయి.

# రస్ లఫాన్.. ఇండియాకు కీలకం



**45 శాతం ద్రవరూప సహజవాయువు దిగుమతి ఇక్కడి నుంచే**

ఖతర్ పాలకుల దార్శనికతకు ప్రత్యక్ష రూపమే రస్ లఫాన్ సహజవాయు క్షేత్రం. వేల కోట్ల రూపాయల పెట్టుబడితో అత్యంత అధునాతన సాంకేతికతతో సృష్టించిన అతిపెద్ద సహజవాయు ప్రాసెసింగ్ కర్మాగారంగా 'రస్ లఫాన్ ఇండస్ట్రియల్ సిటీ' ప్రఖ్యాతిగాంచింది. ఖతార్, ఇరాన్ మధ్యలోని పర్షియన్ గల్ఫ్ సముద్రగర్భంలో సహజవాయు నిక్షేపాలను కనుగొనేందుకు 1996లో రస్ లఫాన్ ఇండస్ట్రియల్ సిటీని నిర్మించారు. వీళ్ల ప్రయత్నాలు ఎట్టకేలకు ఫలించాయి. 1970 దశకంలో అపార సహజవాయు నిక్షేపాలను ఇక్కడి సముద్రగర్భంలో కనుగొన్నారు. ఇరాన్‌తో కలిసి గ్యాస్‌క్షేత్రాన్ని అభివృద్ధిచేసి ఖతర్ తన వాటాగా నార్త్ ఫీల్డ్‌ను తీసుకుంది. దీనినే నార్త్ డోమ్ అని కూడా పిలుస్తారు. ప్రపంచ 20 శాతం ద్రవరూప సహజవాయు అవసరాలను రస్ లఫాన్ క్షేత్రమే తీరుస్తోంది. తమ ఆధీనంలోని 900 ట్రిలియన్ల ఘనపు చదరపు అడుగుల (టీసీఎస్ఎఫ్) మేర సహజవాయువును రస్ లఫాన్ కాంప్లెక్స్ ద్వారా ఖతర్ ప్రాసెస్ చేసి విదేశాలకు ఎగుమతి చేస్తోంది. ఇక్కడే భారీ నౌకలను నిలిపేందుకు వీలుగా ప్రపంచంలోనే అతిపెద్ద కృత్రిమ నౌకాశ్రయాన్ని నిర్మించారు. దీంతో సీఎన్‌జీ కంటైనర్ షిప్‌లు నేరుగా ప్రాసెసింగ్ ప్లాంట్ల దాకా వచ్చి సరుకు నింపుకుని పయనమవుతాయి. ఇక్కడి నుంచి డజన్లకొద్దీ దేశాలకు ఎల్ఎన్‌జీ ఎగుమతి అవుతోంది. ఖతర్‌కు కాసుల వర్షం కురిపిస్తున్న ఈ నేచురల్ గ్యాస్ ఫీల్డ్ ప్రత్యక్షంగా భారత ద్రవరూప సహజవాయువు అవసరాలను తీరుస్తోంది. దోహా నగరానికి 80 కిలోమీటర్ల దూరంలోని ఈ పారిశ్రామిక నగరమే భారత 45 శాతం లిక్విడ్ నేచురల్ గ్యాస్ అవసరాలను తీరుస్తోంది. ఖతర్ ఆర్థికవ్యవస్థ పునాదులను పెకళించేందుకు ఇరాన్ చేస్తున్న ప్రయత్నాలు పరోక్షంగా భారత్‌కు కొత్త కష్టాలు తెచ్చిపెడుతున్నాయి.

**ఎరువులు, సీఎన్‌జీ, పీఎన్‌జీ అంతా ఇక్కడే..**

భారత్‌లో దాదాపు 45 శాతం ఎరువుల తయారీ, కంప్రెస్డ్ నేచురల్ గ్యాస్ (సీఎన్‌జీ), పైప్డ్ నేచురల్ గ్యాస్ (పీఎన్‌జీ) అవసరాలు తీరాలంటే రస్ లఫాన్ క్షేత్రం నుంచి ద్రవరూప సహజవాయువు రావాల్సిందే. భారత్‌లో 34 శాతం ఎరువుల తయారీతోపాటు వాహనాల్లో సీఎన్‌జీకి, గృహావసరాలు తీర్చే పీఎన్‌జీకి రస్ లఫాన్ నుంచి దిగుమతి చేసుకునే ద్రవరూప సహజవాయవునే ఉపయోగిస్తున్నారు. పరిశ్రమల్లో పెట్రోరసాయనాల తయారీకి సైతం ఇదే ఎల్ఎన్‌జీ అవసరం. కొంతమేర భారత విద్యుత్ అవసరాలనూ ఇదే గ్యాస్ తీరుస్తోంది. అమెరికా, ఆఫ్రికా దేశాల నుంచి పోలిస్తే భారత్ రస్ లఫాన్ క్షేత్రం నుంచి ఎల్ఎన్‌జీ దిగుమతి చేసుకోవడమే అత్యంత చవకైన వ్యవహారం. అందుకే భారత్ దీనిపైనే అధికంగా ఆధారపడుతోంది.

## పేదలకు పట్టాభిషేకాన్ని సద్వినియోగం చేసుకోండి.

అర్హులు స్వర్ణ గ్రామం, వార్డు కార్యాలయాల్లో పేర్లు నమోదు చేసుకోండి

తహశీల్దార్ కార్యాలయాల్లోనూ పేర్ల నమోదుకు వీలు.....జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ



విజయవాడ శ్రీ వార్త న్యూస్ జిల్లాలో గతంలో ప్రభుత్వం మంజూరుచేసిన నివేశన స్థల పట్టాలకు అమ్మకపు హక్కుతో కూడిన రిజిస్ట్రేషన్ సౌకర్యం కల్పించేందుకు, ప్రభుత్వ పోరంబోకు భూముల్లో గృహ నిర్మాణం చేసుకొని నివసిస్తున్న అర్హులైన ఆక్రమణదారుల ఆక్రమణల క్రమబద్ధీకరణకు ప్రభుత్వం పేదలకు పట్టాభిషేకం కార్యక్రమాన్ని అమలుచేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ పేర్కొన్నారు. ఈ కార్యక్రమాన్ని అర్హులైన వారు సద్వినియోగం చేసుకోవాలని శుక్రవారం ఓ ప్రకటనలో సూచించారు. అర్హులైన వారు తమ సమీప స్వర్ణ గ్రామం, స్వర్ణ వార్డు కార్యాలయాలను లేదా సంబంధిత తహశీల్దార్ కార్యాలయాన్ని సంప్రదించి, తమ పేర్లను నమోదు చేయించుకోవాలన్నారు. గౌరవ ముఖ్యమంత్రి వారిచే ఈ నెల 30వ తేదీన విజయవాడలో జరిగే పేదలకు పట్టాభిషేకం కార్యక్రమంలో అర్హులైన వారందరూ భాగస్వాములు కావాలని.. ప్రభుత్వం కల్పిస్తున్న ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ పట్టాలకు రిజిస్ట్రేషన్ సౌకర్యం, ఇతర ప్రయోజనాలు పొందాల్సిందిగా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ సూచించారు.

## ఎంఎస్ఎంఈల అభివృద్ధికి బ్యాంకుల బాసట సులభతర రుణాలతో సమర్థవంతమైన చేయూత

రుణ దరఖాస్తుల సత్వర పరిశీలన,పరిష్కారానికి బ్యాంకుల చర్యలు

ప్రత్యేక సమన్వయ సమావేశంలో ఎస్ఎల్‌బీసీ కన్వీనర్ కె.శ్రీధర బాబు




విజయవాడ శ్రీ వార్త న్యూస్ ఎంఎస్ఎంఈ పారిశ్రామికవేత్తలకు రుణ సహకారాన్ని బలోపేతం చేయడంతో పాటు, వారికి అవసరమైన మార్గదర్శకత్వం, చేయూత సేవలను సమర్థవంతంగా అందించేందుకు శుక్రవారం విజయవాడ వన్‌టౌన్‌లోని లీడ్ బ్యాంక్ యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా జోనల్ కార్యాలయంలో ఎంఎస్ఎంఈ చేయూత సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి స్టేట్ లెవెల్ బ్యాంకర్స్ కమిటీ (ఎస్ఎల్‌బీసీ) కన్వీనర్, యూబీఐ జనరల్ మేనేజర్ కె.శ్రీధర బాబు, కేవీఐసీ స్టేట్ హెడ్ గ్రీప్, జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ ఎం.మధు, వివిధ బ్యాంకుల అధికారులు, పరిశ్రమల శాఖ, సంబంధిత శాఖల అధికారులు, ఎంఎస్ఎంఈ పారిశ్రామికవేత్తలు హాజరయ్యారు.సమావేశంలో ఎంఎస్ఎంఈలకు రుణ సదుపాయాలు, ప్రభుత్వ ప్రాయోజిత పథకాలు, రుణ ప్రతిపాదనల సత్వర పరిశీలన, పారిశ్రామికవేత్తలకు అవసరమైన మార్గదర్శకత్వం అంశాలపై చర్చించారు. అర్హత కలిగి, ఆచరణ సాధ్యమైన ఎంఎస్ఎంఈ ప్రాజెక్టులకు నిబంధనలకు అనుగుణంగా, తగిన మూల్యాంకనం అనంతరం ఆర్థిక సహాయం అందించేందుకు బ్యాంకులు సిద్ధంగా ఉన్నట్లు అధికారులు తెలిపారు. పారిశ్రామికవేత్తలు తాము ప్రతిపాదిస్తున్న ప్రాజెక్టుపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ప్రాజెక్టు వ్యయం, మార్కెట్ అవకాశాలు, నిర్వహణ అవసరాలు, అంచనా ఆదాయం, వ్యయాలు, రుణాన్ని తిరిగి చెల్లించే సామర్థ్యం తదితర అంశాలపై స్పష్టమైన అవగాహనతో ప్రతిపాదనలు సమర్పిస్తే రుణాల పరిశీలన, మంజూరు ప్రక్రియ సులభతరం అవుతుందని శ్రీధర్‌బాబు తెలిపారు. వ్యాపారం కోసం పొందిన రుణ మొత్తాన్ని, వ్యాపారం ద్వారా వచ్చే ఆదాయాన్ని నిర్దేశిత వ్యాపార అవసరాలకే వినియోగిస్తూ, సంస్థ కార్యకలాపాలను సజావుగా నిర్వహించి, రుణాలను సకాలంలో తిరిగి చెల్లించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. పూర్తి అర్హత కలిగిన రుణ దరఖాస్తులను బ్యాంకులు వీలైనంత త్వరగా పరిశీలించి పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని నిర్ణయించారు. డాక్యుమెంటేషన్, పథకాల అర్హత, ఆచరణ సాధ్యమైన ప్రాజెక్టు ప్రతిపాదనల రూపకల్పన తదితర అంశాల్లో పారిశ్రామికవేత్తలకు బ్యాంకులు, డీఐసీ, కేవీఐసీ అధికారులు అవసరమైన మార్గదర్శకత్వం అందించాలని నిర్ణయించారు. అర్హత కలిగిన ఎంఎస్ఎంఈ రుణ ప్రతిపాదనల పరిష్కారానికి బ్యాంకులు, డీఐసీ, కేవీఐసీ, ఇతర సంబంధిత శాఖల మధ్య నిరంతర సమన్వయం కొనసాగించాలని సమావేశంలో నిర్ణయించారు.ఈ సమావేశంలో యూబీఐ రీజనల్ హెడ్ ఎంవీ తిలక్, ఏజీఎం (ఎంఎల్‌పీ) వెంకటేశ్వరరావు, ఏపీఐఐసీ జోనల్ హెడ్ రహీమ్, ఏజీఎం శ్యామ్, ఎన్‌టీఆర్ జిల్లా ఎల్‌డీఎం వెంకట సుబ్బయ్యతో పాటు వివిధ బ్యాంకుల అధికారులు, పరిశ్రమల శాఖ అధికారులు, ఎంఎస్ఎంఈ పారిశ్రామికవేత్తలు పాల్గొన్నారు.

## జిల్లా అభివృద్ధిలో ప్రజా పరిషత్ పాత్ర ఎంతో కీలకం.

ప్రత్యేక అధికారిగా బాధ్యతలు స్వీకరించిన జిల్లా కలెక్టర్ డీకే బాలాజి




మచిలీపట్నం శ్రీవార్త న్యూస్ కృష్ణా జిల్లా ప్రజా పరిషత్ ప్రత్యేక అధికారిగా జిల్లా కలెక్టర్ డీకే బాలాజి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. నగరంలోని జిల్లా ప్రజా పరిషత్ కార్యాలయంలో ఆయన ప్రత్యేక అధికారిగా విధులు చేపట్టారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ సతీమణి పృథ్వీ కళ్యాణితో కలిసి హాజరయ్యారు. ఆయన తండ్రి కృష్ణయ్య శెట్టి కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లా సమగ్ర అభివృద్ధిలో జిల్లా ప్రజా పరిషత్ కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. రాజ్యాంగబద్ధమైన సంస్థగా ప్రజా పరిషత్‌కు ఉన్న బాధ్యతలను ప్రజా ప్రయోజనాలను ప్రధానంగా దృష్టిలో ఉంచుకుని సమర్థవంతంగా నిర్వహించాల్సిన అవసరం ఉందన్నారు.జిల్లా ప్రజా పరిషత్ పరిధిలో ప్రస్తుతం అమలవుతున్న కార్యక్రమాలు, అందుబాటులో ఉన్న వనరులు, అభివృద్ధి అవసరాలు, ప్రజలకు అందుతున్న సేవలను సమగ్రంగా పరిశీలిస్తామని కలెక్టర్ తెలిపారు. సంబంధిత అంశాలపై పూర్తిస్థాయిలో సమీక్ష నిర్వహించి, జిల్లా అభివృద్ధికి ప్రజా పరిషత్ ద్వారా చేపట్టాల్సిన పనులు, కార్యక్రమాలను గుర్తిస్తామని పేర్కొన్నారు.ప్రజల అవసరాలు, స్థానిక పరిస్థితులను పరిగణనలోకి తీసుకుని ప్రాధాన్యతా క్రమంలో



అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టేందుకు చర్యలు తీసుకుంటామని కలెక్టర్ డీకే బాలాజి తెలిపారు. ప్రజా ప్రయోజనమే ప్రధాన లక్ష్యంగా జిల్లా ప్రజా పరిషత్ బాధ్యతలను చిత్తశుద్ధితో, సమర్థవంతంగా నిర్వర్తిస్తామని ఆయన స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో డీఆర్వో కే శ్రీధర్ రెడ్డి, జెడ్పీ సీఈవో డాక్టర్ జే అరుణ, డిప్యూటీ సీఈవో డాక్టర్ ఆనంద్ కుమార్, జిల్లా పరిషత్ ఉద్యోగులు పాల్గొన్నారు.

# విజయవాడలో తొలిసారిగా ఢిల్లీ స్థాయి జాతీయ సరస్ ఆజీవిక మేళా--2026

అక్టోబర్ 08 నుంచి 22 వరకు పున్నమి ఘాట్‌లో 600 స్టాళ్లతో నిర్వహణ

దేశవ్యాప్తంగా 2,500 మంది మహిళా పారిశ్రామికవేత్తలు, గ్రామీణ కళాకారుల భాగస్వామ్యం

ఎస్‌హెచ్‌జీ ఉత్పత్తులకు జాతీయ స్థాయి మార్కెటింగ్, బ్రాండింగ్, విక్రయాలకు భారీ వేదిక

కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి డా.పెమ్మసాని చంద్రశేఖర్, రాష్ట్ర ఎంఎస్ఎంఈ, సెర్ప్ శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్

విజయవాడ శ్రీ వార్త న్యూస్ విజయవాడ నగరంలో తొలిసారిగా ఢిల్లీ స్థాయిలో జాతీయ సరస్ ఆజీవిక మేళా--2026 నిర్వహించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. అక్టోబర్ 08 నుంచి 22వ తేదీ వరకు పున్నమి ఘాట్‌లో సుమారు 600 స్టాళ్లతో ఈ మేళాను నిర్వహించనున్నారు. మేళా నిర్వహణకు ఎంపిక చేసిన పున్నమి ఘాట్ ప్రాంతాన్ని శుక్రవారం కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి డా.పెమ్మసాని చంద్రశేఖర్, రాష్ట్ర ఎంఎస్ఎంఈ, సెర్ప్ శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ శుక్రవారం పరిశీలించారు. మౌలిక సదుపాయాలు, స్టాళ్ల ఏర్పాటు, భద్రత, పార్కింగ్, విద్యుత్, తాగునీరు, సందర్శకుల సౌకర్యాలపై సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.అనంతరం విజయవాడ కలెక్టరేట్‌లోని శ్రీ పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో మేళా నిర్వహణపై సమీక్ష నిర్వహించారు. సెర్ప్ సీఈవో వాకాటి కరుణ, ఎన్‌ఆర్‌ఎల్‌ఎం జాయింట్ సెక్రటరీ స్వాతి శర్మ, డైరెక్టర్ మౌలిశ్రీ, జిల్లా కలెక్టర్ డాక్టర్ జి. లక్ష్మీశ, పోలీస్ కమిషనర్ ఎస్.వి. రాజశేఖర్ బాబు, వివిధ శాఖల అధికారులు సమావేశంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి డా. పెమ్మసాని చంద్రశేఖర్ మాట్లాడుతూ, జాతీయ సరస్ ఆజీవిక మేళా మహిళా స్వయం సహాయక సంఘాలు, గ్రామీణ కళాకారులు, మహిళా పారిశ్రామికవేత్తలు తమ ఉత్పత్తులను జాతీయ స్థాయిలో ప్రదర్శించి విక్రయించుకునే మార్కెటింగ్ వేదికగా నిలుస్తుందని తెలిపారు. గత ఏడాది గుంటూరులో సుమారు 300 స్టాళ్లతో నిర్వహించిన సరస్ మేళాలో సుమారు రూ.30 కోట్ల మేర వ్యాపారం జరిగినట్లు తెలిపారు. ఈసారి విజయవాడలో 600 స్టాళ్లతో మరింత భారీ స్థాయిలో మేళాను నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు చెందిన సుమారు



2,500 మంది మహిళా ఎస్‌హెచ్‌జీ సభ్యులు, గ్రామీణ కళాకారులు, మహిళా పారిశ్రామికవేత్తలు పాల్గొని తమ రాష్ట్రాలకు ప్రత్యేకమైన హస్తకళలు, చేనేత, ఆహార పదార్థాలు, సహజ ఉత్పత్తులు, గ్రామీణ కళాకృతులను ప్రదర్శించి విక్రయించనున్నట్లు తెలిపారు. మేళాలో హ్యాండ్లూమ్, హ్యాండీక్రాఫ్ట్, నేచురల్ ఫుడ్, లైవ్ ఫుడ్ తదితర విభాగాలతో పాటు నాబార్డ్, ఎంఎస్ఎంఈ, బ్యాంకులు, ఆర్థిక సంస్థలు, ఇతర ప్రభుత్వ శాఖలకు కూడా స్టాళ్లు ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. సరస్ మేళా ద్వారా ఎస్‌హెచ్‌జీ ఉత్పత్తులకు మార్కెట్ అనుసంధానాలు, బ్రాండింగ్, విలువ జోడింపు, నాణ్యత, ప్యాకేజింగ్, విక్రయాల విస్తరణకు అవకాశాలు లభిస్తాయని మంత్రి తెలిపారు. కొనుగోలుదారులు, సంస్థలు, మార్కెట్ ఏజెన్సీలతో ప్రత్యక్ష సంబంధాలు ఏర్పడటం ద్వారా మహిళా ఎస్‌హెచ్‌జీ సభ్యులకు కొత్త మార్కెట్లు అందుబాటులోకి వస్తాయని పేర్కొన్నారు. తద్వారా వారి ఆదాయం, స్థిరమైన జీవనోపాధికి మేళా దోహదపడుతుందని తెలిపారు. వెల్‌కమ్ పెవిలియన్, లెర్నింగ్ అండ్ నాలెడ్జ్ పెవిలియన్, కన్వర్జెన్స్ పెవిలియన్, లక్షపతి దీదీ పెవిలియన్, ఫుడ్ కోర్ట్, సాంస్కృతిక కార్యక్రమాల వేదిక, పిల్లల ఆటల ప్రాంతం, పార్కింగ్ తదితర సదుపాయాలను ఏర్పాటు చేయనున్నట్లు మంత్రి వెల్లడించారు. మహిళా సాధికారతకు సరస్ మేళా గొప్ప అవకాశం: కొండపల్లి శ్రీనివాస్ రాష్ట్ర ఎంఎస్ఎంఈ, సెర్ప్ శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ, మహిళా సాధికారతకు జాతీయ సారస్ ఆజీవిక మేళా గొప్ప అవకాశంగా నిలుస్తుందని అన్నారు. సాధారణంగా ఢిల్లీలో నిర్వహించే స్థాయి సారస్ మేళాను ఈ ఏడాది విజయవాడలో నిర్వహించేలా కేంద్ర ప్రభుత్వంతో సమన్వయం చేసి రాష్ట్రానికి తీసుకురావడం జరిగిందన్నారు. ఇతర రాష్ట్రాల ఎస్‌హెచ్‌జీలతో పాటు ఆంధ్రప్రదేశ్‌కు చెందిన స్వయం సహాయక సంఘాల ఉత్పత్తులకు విస్తృత ప్రచారం, మార్కెట్, విక్రయ అవకాశాలు కల్పించనున్నట్లు తెలిపారు. దసరా ఉత్సవాల సమయంలో మేళా నిర్వహించడం వల్ల విజయవాడలో ఉత్సవ వాతావరణం మరింత పెరుగుతుందని పేర్కొన్నారు. రాష్ట్రంలోని



స్వయం సహాయక సంఘాలు, గ్రామీణ కళాకారులు తయారు చేస్తున్న నాణ్యమైన ఉత్పత్తులకు ప్రత్యేక గుర్తింపు, మార్కెటింగ్ అవకాశాలు కల్పించేందుకు 'స్వయం ఏపీ' బ్రాండ్‌ను ప్రకటించి ముందుకు తీసుకెళ్లనున్నట్లు మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు. గత 35 సంవత్సరాలుగా డ్వాక్రా మహిళలకు బ్యాంకు లింకేజీ, స్వయం ఉపాధి, మార్కెటింగ్, వ్యాపార అభివృద్ధి తదితర అంశాల్లో ప్రభుత్వం సహకారం అందిస్తోందన్నారు. గ్రామీణ మహిళల ఉత్పత్తులకు స్థానిక మార్కెట్‌తో పాటు జాతీయ, అంతర్జాతీయ మార్కెట్ అవకాశాలను కల్పించడమే లక్ష్యంగా చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు. మేళా విజయవంతంగా నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం, సెర్ప్, పోలీస్, మున్సిపల్, పర్యాటక, వైద్య ఆరోగ్య, విద్యుత్, అగ్నిమాపక, రవాణా తదితర శాఖలు సమన్వయంతో పనిచేయాలని సమావేశంలో నిర్ణయించారు. భద్రత, ట్రాఫిక్ నియంత్రణ, పార్కింగ్, తాగునీరు, పారిశుధ్యం, విద్యుత్, వైద్య సేవలు, అగ్నిమాపక భద్రత వంటి అంశాలకు ప్రత్యేక ప్రాధాన్యం ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. మార్కెట్ అందుబాటు, ఉత్పత్తుల ప్రదర్శన, బ్రాండింగ్, ప్రత్యక్ష విక్రయాలు, వ్యాపార అనుసంధానాలు, మహిళా సాధికారత లక్ష్యాలతో జాతీయ సరస్ ఆజీవిక మేళా--2026ను విజయవాడలో ప్రతిష్టాత్మకంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు మంత్రి తెలిపారు.



# రైతు సంక్షేమమే ప్రభుత్వ తొలి ప్రాధాన్యం ఖరీఫ్ ధాన్యం సేకరణకు పకడ్బందీ ఏర్పాట్లు

రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సేకరణ ప్రక్రియ

వినియోగదారుల వ్యవహారాలు, ఆహార మరియు పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్




విజయవాడ శ్రీవార్త న్యూస్ రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా 2026-27 ఖరీఫ్ ధాన్యం సేకరణకు పకడ్బందీగా ఏర్పాట్లు చేస్తున్నామని రాష్ట్ర వినియోగదారుల వ్యవహారాలు, ఆహార మరియు పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. మాది సంపూర్ణ రైతు ప్రభుత్వమని, రైతుకు న్యాయం చేయడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యం అని ఆయన స్పష్టం చేశారు. సొంత వాహనాల్లో ధాన్యం తరలించే రైతులకు రవాణా ఛార్జీలను వెంటనే చెల్లింపులు చేస్తామన్నారు. గన్నీ బ్యాగుల కొరత లేకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. 37 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ లక్ష్యమని, అవసరమైతే కేంద్ర ప్రభుత్వంతో సంప్రదించి ధాన్యం సేకరణ అంచనాలు పెంచుతామన్నారు.శుక్రవారం విజయవాడ అంత్రాలక్స్ కన్వెన్షన్ సెంటర్‌లో నిర్వహించిన 2026-27 ఖరీఫ్ ధాన్యం సేకరణ రాష్ట్రస్థాయి సన్నద్ధత సమావేశంలో రాష్ట్ర వినియోగదారుల వ్యవహారాలు, ఆహార మరియు పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ పాల్గొన్నారు. ఈ




సందర్భంగా వర్క్ షాపులో పాల్గొన్న అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం మంత్రి మీడియాతో మాట్లాడుతూ... ఈ ఖరీఫ్ సీజన్‌లో రాష్ట్రవ్యాప్తంగా 37 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. ఎల్‌నీనో ప్రభావం ఉంటుందని తొలుత అంచనా వేసినప్పటికీ, ప్రస్తుతం రాష్ట్రంలో సమృద్ధిగా మూడు రోజులపాటు వర్షాలు కురుస్తుండటంతో ధాన్యం దిగుబడి పెరిగే అవకాశం ఉందన్నారు. అందువల్ల ఉత్పత్తి అంచనాలను మరోసారి సమీక్షించి, అవసరమైతే సవరించనున్నట్లు చెప్పారు.

### 24 గంటల్లోనే రైతుల ఖాతాల్లో సేకరణ సొమ్ము

ధాన్యం సేకరణలో కూటమి ప్రభుత్వం అనేక సంస్కరణలు తీసుకొచ్చిందని మంత్రి తెలిపారు. గత ఖరీఫ్‌లో సుమారు రూ.12 వేల కోట్ల ధాన్యం సేకరణ సొమ్మును రైతులకు 24 గంటల్లోపే చెల్లించామని పేర్కొన్నారు. అదే విధంగా ఈసారి కూడా రైతులకు ఎలాంటి జాప్యం లేకుండా సేకరణ సొమ్ము చెల్లించేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు.

### సొంత వాహనాలతో ధాన్యం తరలించే రైతులకు వెంటనే రవాణా ఛార్జీలు

రైతులు తమ సొంత వాహనాల్లో కల్లాల నుంచి రైస్ మిల్లులకు ధాన్యం తరలించినప్పుడు రవాణా ఛార్జీల చెల్లింపులో జాప్యం జరుగుతున్న సమస్యను ఈ ఖరీఫ్ నుంచి పరిష్కరిస్తామని మంత్రి తెలిపారు. సొంత వాహనాలను ఏర్పాటు చేసుకుని ధాన్యం తరలించే రైతులకు రవాణా ఛార్జీలు సకాలంలో, వీలైనంత త్వరగా వారి ఖాతాల్లో జమ చేసేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ ఖరీఫ్‌లో రాష్ట్రవ్యాప్తంగా ధాన్యం సేకరణ కోసం దాదాపు 31 వేల వాహనాలను అందుబాటులో ఉంచనున్నట్లు వెల్లడించారు.

### 6.10 కోట్ల గన్నీ బ్యాగులు సిద్ధం

ధాన్యం సేకరణకు ఈ సీజన్‌లో 6.10 కోట్ల గన్నీ బ్యాగులను అందుబాటులో ఉంచుతున్నామన్నారు. ఎక్కడా గన్నీ బ్యాగుల కొరత రాకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నామని, నాణ్యమైన గన్నీ బ్యాగులు రైతులకు అందేలా చూస్తున్నామని చెప్పారు. ఒకవేళ ఎక్కడైనా గన్నీ బ్యాగుల కొరత ఏర్పడితే ప్రత్యామ్నాయ బ్యాగులను వెంటనే అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించినట్లు మంత్రి తెలిపారు.

### 2,619 ధాన్యం సేకరణ కేంద్రాలు

రాష్ట్రవ్యాప్తంగా ఈ ఖరీఫ్ సీజన్‌లో 2,619 ధాన్యం సేకరణ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామని వెల్లడించారు. అవసరమైన అన్ని సౌకర్యాలతో సేకరణ కేంద్రాలను సిద్ధం చేస్తున్నామని, సుమారు 24 వేల మంది సిబ్బంది రైతులకు సేవలు అందించనున్నారని తెలిపారు. సేకరణ కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని జిల్లాల జాయింట్ కలెక్టర్లు క్షేత్రస్థాయిలో పర్యటించాలని ఆదేశించినట్లు చెప్పారు. ముందస్తుగానే సిబ్బందికి ధాన్యం సేకరణ కేంద్రాల నిర్వహణపై అవగాహన సదస్సులు నిర్వహించాలని సూచించినట్లు తెలిపారు.

### రైస్ మిల్లర్లు ప్రభుత్వానికి సహకరించాలి

ధాన్యం సేకరణ ప్రక్రియలో రైస్ మిల్లర్లు కూడా ప్రభుత్వానికి పూర్తిస్థాయిలో సహకరించాలని మంత్రి కోరారు. వారికి కేటాయించిన లక్ష్యాలను సమయానికి పూర్తి చేయడంతో పాటు రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సహకరించాలని సూచించారు.

### రైతుల కోసం ప్రత్యేక సహాయ కేంద్రాలు

ధాన్యం సేకరణకు సంబంధించి రైతుల సమస్యలను తక్షణమే పరిష్కరించేందుకు రాష్ట్రస్థాయిలో ప్రత్యేక సెల్ ఏర్పాటు చేయాలని ప్రభుత్వం భావిస్తున్నట్లు తెలిపారు. అదే విధంగా జిల్లాల వారీగా జాయింట్ కలెక్టర్లు ప్రత్యేక సహాయ కేంద్రాలను ఏర్పాటు చేసి రైతులకు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. రైతులకు కష్టం రాకుండా చూడటమే ప్రభుత్వ ఆశయమన్నారు. ధాన్యం సేకరణలో ఎప్పటికప్పుడు కొత్త సంస్కరణలు తీసుకొస్తూ, రైతులకు వేగవంతమైన సేవలు అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. గత ఖరీఫ్‌లో సాధించిన విజయాన్ని స్ఫూర్తిగా తీసుకుని ఈ ఖరీఫ్ ధాన్యం సేకరణను కూడా విజయవంతంగా పూర్తి చేస్తామన్నారు. వర్క్ షాపులో జిల్లాల జాయింట్ కలెక్టర్లు, రైతులు, రైస్ మిల్లర్లతో రాష్ట్రవ్యాప్తంగా నవంబర్ 1వ తేదీ నుంచి ఖరీఫ్ ధాన్యం సేకరణ ప్రక్రియను ప్రారంభించనున్నట్లు మంత్రి తెలిపారు. వ్యవసాయ శాఖ అంచనాల ప్రకారం ఈ ఖరీఫ్ సీజన్‌లో సుమారు 37 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించాలని ప్రభుత్వం లక్ష్యంగా నిర్దేశించిందన్నారు.

### 2,619 కొనుగోలు కేంద్రాల ఏర్పాటు

రైతులకు అందుబాటులో ఉండేలా రాష్ట్రవ్యాప్తంగా 2,619 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామని మంత్రి తెలిపారు. కొనుగోలు కేంద్రాల నిర్వహణ కోసం దాదాపు 24 వేల మంది సిబ్బందిని కేటాయిస్తున్నట్లు వెల్లడించారు. ధాన్యం సేకరణకు అవసరమైన మౌలిక వసతులను ముందుగానే సిద్ధం చేస్తున్నామని, ఇందులో భాగంగా 6.10 కోట్ల గన్నీ బ్యాగులను అందుబాటులో ఉంచుతున్నట్లు చెప్పారు.

### జీపీఎస్ వాహనాలతో ధాన్యం రవాణా

ధాన్యం రవాణాలో పారదర్శకత, వేగం, జవాబుదారీతనానికి ప్రాధాన్యం ఇస్తున్నామని మంత్రి తెలిపారు. ఇందుకోసం జీపీఎస్



అమర్చిన సుమారు 31 వేల వాహనాలను వినియోగించనున్నట్లు వెల్లడించారు.దేశంలోనే తొలిసారిగా ధాన్యం కొనుగోలుతో పాటే రైతులు తమ సొంత వాహనాల్లో ధాన్యం తరలిస్తే రవాణా ఛార్జీలను నేరుగా రైతుల ఖాతాల్లో జమ చేసే విధానాన్ని అమలు చేస్తున్నామని మంత్రి తెలిపారు. రైతులకు చెల్లింపులు ఆలస్యం కాకుండా సాంకేతికతను వినియోగిస్తూ ప్రక్రియను మరింత పారదర్శకంగా నిర్వహిస్తున్నామని చెప్పారు.

### గత ఖరీఫ్‌లో రూ.12 వేల కోట్ల విలువైన ధాన్యం సేకరణ

గత ఖరీఫ్ సీజన్‌లో సుమారు రూ.12 వేల కోట్ల విలువైన ధాన్యాన్ని సేకరించామని మంత్రి తెలిపారు. ఇందులో 92 శాతానికి పైగా మొత్తాన్ని 24 గంటల్లోనే రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ చేశామని పేర్కొన్నారు. రైతులకు సకాలంలో చెల్లింపులు అందేలా ఈసారి కూడా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు.

### వర్షాల పరిస్థితులకు అనుగుణంగా సేకరణ లక్ష్యాల్లో మార్పులు

ఎల్-నినో ప్రభావం కారణంగా గతంలో 1.60 కోట్ల టన్నులుగా ఉన్న ధాన్యం ఉత్పత్తి అంచనా సుమారు 1.10 కోట్ల టన్నులకు తగ్గిందని మంత్రి తెలిపారు. అయితే ప్రస్తుతం రాష్ట్రంలో కురుస్తున్న వర్షాలు, పంట పరిస్థితులను పరిగణనలోకి తీసుకుని అవసరమైతే ధాన్యం సేకరణకు సంబంధించిన అంచనాల్లో మార్పులు చేయడానికి కేంద్ర ప్రభుత్వంతో చర్చిస్తామని వెల్లడించారు.

### రైతులకు ఇబ్బందులు లేకుండా సమన్వయంతో పనిచేయాలి

క్షేత్రస్థాయిలో ఎదురయ్యే సమస్యలను ఎప్పటికప్పుడు గుర్తించి పరిష్కరించాలని, ప్రతి దశలో జవాబుదారీతనం, పారదర్శకత, సమన్వయం పాటించాలని సూచించారు. ధాన్యం సేకరణ ప్రక్రియలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పౌరసరఫరాలు, వ్యవసాయ శాఖ అధికారులు, జాయింట్ కలెక్టర్లు, మిల్లర్లు సమన్వయంతో పనిచేయాలని మంత్రి నాదెండ్ల మనోహర్ ఆదేశించారు.తొలుత మంత్రి నాదెండ్ల మనహర్ వర్క్ షాపును ప్రారంభించి మాట్లాడిన అనంతరం వినియోగదారుల వ్యవహారాలు, ఆహార మరియు పౌరసరఫరాల శాఖ కమిషనర్ కె. కన్నబాబు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ధాన్యం సేకరణ ప్రక్రియలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. ఖరీఫ్ పంట వివరాలు, తదితర విషయాలను వ్యవసాయ శాఖ డైరెక్టర్ డా. మనజీర్ జిలాని సమూన్ వివరించారు.కార్యక్రమంలో, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పౌరసరఫరాల సంస్థ చైర్మన్ తోట మెహర్ సీతారామ సుధీర్ (తోట సుధీర్), ఆచార్య ఎన్.జి. రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ఎ ఎన్ జి ఆర్ ఎ యు వైస్ ఛాన్సలర్ డా. పి.వి. సత్యనారాయణ, పౌర సరఫరాల శాఖ డైరెక్టర్, శ్రీమతి నుపూర్ అజయ్ కుమార్, రాష్ట్ర రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షులు జి. వెంకటేశ్వర రావు జిల్లాల జాయింట్ కలెక్టర్లు, జిల్లా సివిల్ సప్లై అధికారులు, రైతులు, రైస్ మిల్లర్లు, తదితరులు పాల్గొన్నారు.

Pulisher,Owner and Editor kureti satish, printed by Teja cards and stationery ground floor 26-25-2durgi vari veedhi,opp Inox theater Gandhi nagar Vijayawada ,Andra Pradesh 520003.PRGS Nembar: APTEL/26/A4813, Editor: kureti satish,cell number:9866640784,H. No:21-651a,near Suvarna Kalyana mandapam,parasupeta machilipatnam Krishna Distric, Andra Pradesh.521001